పోలీసులతో డ్వాక్రా మహిళల వాగ్వాదం



ఇదేమి 'ఆసరా'

- గేట్లు వేసి సమావేశం
- నీళ్లు లేవు.. కూర్చునేందుకు కుర్చీలు లేవు
- తల్లడిల్లిన డ్వాక్రా మహిళలు
- నాలుగో విడత

35,525 మందికి రూ.32.81 కోట్లు మంజూరు

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 27: కడప నగరం మరియాపురం లూర్దుమాత చర్చి ఎండీ ప్రకాశం కళావేదిక మైదానంలో శనివారం మున్సిపల్ కార్పొరేషన్, మెప్మా సంయుక్త ఆధ్వర్యంలో నాలుగో విడత వైఎస్సార్ ఆసరా కార్యక్రమం నిర్వహించారు. కడప కార్పొరేషన్ పరిధిలో వైసీపీ నాయకులు పెద్ద ఎత్తున మహిళలను తరలించారు. అయితే వచ్చిన వారికి తగ్గట్లుగా వసతులను కల్పించలేకపోయారు. షామియానా వేసి అందులో మాత్రమే కుర్చీలు ఏర్పాటుచేశారు. ఎక్కువ మంది మహిళలు రావడంతో వారికి సరిపడా కుర్చీలు లేవు. అలాగే ఎండవేడి ఎక్కువగా ఉంది. కనీసం తాగునీరు కూడా ఏర్పాటు చేయలేదు. ఎండ వేడికి నాలుకలు పిడచకట్టుకుపోయాయి. జనం నీటి కోసం దిక్కులు చూశారు. దీంతో ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా మాట్లాడక ముందే మహిళలు ఇంటి దారి పట్టారు. ఎండ వేడిమికి తాళలేక దప్పికతో వైసీపీ నాయకులకు శాపనార్థాలు పెట్టారు.

గేట్లు వేసి సమావేశం


ఆసరా కార్యక్రమంలో మహిళలు వెళ్లిపోతారని ముందుగానే ఊహించిన వైసీపీ నేతలు మహిళలను బయటికి వెళ్లకుండా సభా ప్రాంగణం గేట్లకు తాళాలు వేసి పోలీసులను కాపలా ఉంచారు. అయితే మహిళలు పోలీసులతో వాగ్వాదానికి దిగి ఇంటిదారి పట్టారు. డ్వాక్రా పొదుపు సంఘాల మహిళలు తీసుకున్న రుణాలకు చెల్లించిన వడ్డీ మొత్తాన్ని వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం తిరిగి చెల్లిస్తుంది. ఇందులో భాగంగా కడప కార్పొరేషన్ పరిధిలో గల పొదుపు సంఘాల ఖాతాల్లో 35,525 మంది లబ్ధిదారులకు రూ.32,81,00,598 మొత్తాన్ని జమచేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, మెప్మా పీడీ సురేశ్‌కుమార్ రెడ్డి, సోషల్ వెల్ఫేర్ చైర్మన్ పులి సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

ఆసరాలో ఆర్పీల చేతివాటం

వైఎస్సార్ ఆసరా నాలుగో విడత నిధులు మంజూరవుతాయన్న నేపథ్యంలో ఆర్పీలు చేతివాటం చూపారని పలువురు డ్వాక్రా మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. కొంత మంది ఆర్పీలు డ్వాక్రామహిళల నుంచి వసూళ్లకు పాల్పడ్డారని సమాచారం. ఇదేమిటని ప్రశ్నిస్తే పైస్థాయి అధికారుల నుంచి కింది స్థాయి ఉద్యోగుల వరకు మామూళ్లు ఇచ్చుకోవాలని లేదంటే ఆసరా నిధులకు అడ్డుకట్ట పడుతుందని సమాధానం ఇస్తున్నారని పేర్కొన్నారు. ఒకవేళ లంచం ఇచ్చినట్లు బయటికి చెబితే గ్రూపుల నుంచి ఆ సభ్యురాలిని తొలగిస్తామని బెదిరించారని సమాచారం.

మీ సేవలు చాలు..!

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పెండింగు బిల్లులు చెల్లించాలని, చికిత్స ప్యాకేజీ ధరలు పెంచాలంటూ ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యం కొద్దిరోజులుగా డిమాండ్ చేస్తున్నారు. ఇప్పుడు కూడా రాష్ట్రవ్యాప్తంగా వెయ్యి కోట్లు బకాయిలున్నాయి. ప్రభుత్వం చర్చలు జరిపింది. పరిష్కరిస్తామని హామీ ఇస్తూ వస్తోంది. అయితే విసిగివేసారిన ప్రైవేటు ఆసుపత్రులు సమ్మెబాట పట్టాయి. ఇందులో జిల్లాకు సంబంధించి 15 మంది సమ్మె నోటీసు ఇచ్చారు. అంతే.. సమ్మె నోటీసు ఇచ్చిన 15 ఆసుపత్రులను ఏకంగా ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ నుంచి తొలగించారు. ఈ ఆసుపత్రుల్లో గురువారం సాయంత్రం నుంచే ఆరోగ్యశ్రీ వైద్యసేవలు నిలిచిపోయాయి. మిగిలిన ఆసుపత్రులు కూడా బిల్లులు రావనే అనుమానంతో ఆరోగ్యశ్రీలో చికిత్స చేయడం లేదు. దీంతో పేదలు వైద్యసేవలకోసం ఇబ్బంది పడుతున్నారు. పేదలకు కార్పొరేట్ వైద్యం అందించడంలో మరోసారి సీఎం వైఎస్ జగన్ ఇలా తన చిత్తశుద్ధి నిరూపించుకున్నారు.





కడపలో మూతబడ్డ ఆరోగ్యశ్రీ వైద్యసేవ ఆరోగ్య కార్యాలయం

- ఆరోగ్యశ్రీ బిల్లులు చెల్లించాలని..
- ప్యాకేజీ పెంచాలని ప్రైవేటు ఆసుపత్రుల డిమాండ్
- ప్రభుత్వం స్పందించకపోవడంతో సమ్మెలోకి..
- నెట్‌వర్క్ నుంచి 15 ఆసుపత్రులను తొలగించిన ప్రభుత్వం
- పేదలకందే కార్పొరేట్ వైద్యంపై.. ఇదీ సీఎం జగన్ తీరు
- ఇటు రోగులు, అటు ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యం ఇబ్బందులు

(కడప-ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రూటే వేరు. తాను చెప్పిందే వేదం. తాను చేసిందే శాసనం అంటూ నాలుగున్నరేళ్లుగా పాలన సాగిస్తున్నారు. న్యాయమైన కోరికలు, సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికులు ఆందోళనలు చేస్తే కొంతమేరైనా సానుకూలంగా స్పందించాలి. అయితే సీఎం జగన్ తీరు వేరుగా ఉంటుంది. ఇచ్చిన హామీలు అమలు చేయాలంటూ సమ్మె చేసిన అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగించి ఉద్యోగాలు తొలగిస్తామని బెదిరించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ప్రైవేటు ఆసుపత్రుల వంతు వచ్చింది. జిల్లాలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ పరిధిలో 36 ప్రైవేటు ఆసుపత్రులు ఉన్నాయి. ఇక్కడ 3,251 రకాల వ్యాధులకు చికిత్స అందిస్తున్నారు. ఇటీవలే ఆరోగ్యశ్రీ వైద్య చికిత్స పరిమితిని రూ.25లక్షలకు పెంచారు. జిల్లాలో ఇప్పటివరకు ఆరోగ్యశ్రీ ద్వారా 3,934 మంది శస్త్రచికిత్సలు చేయించుకుంటే రూ.634 కోట్లు ఖర్చు చేసినట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి.

బకాయిల భారం

రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు గత ఏడాది జూన్ నుంచి బిల్లుల చెల్లింపులు నిలిచిపోయాయి. రాష్ట్రవ్యాప్తంగా రూ.1,000 కోట్లు ఉంటుంది. మన జిల్లాలో సుమారు రూ.30 కోట్ల పైమాటే ఉంటుంది. ఆరోగ్యశ్రీ ద్వారా ప్రైవేటు ఆసుపత్రులలో ఆర్థో శస్త్రచికిత్సలు, గుండె, కంటి, డయాలసిస్ ఇతరత్రా వ్యాధులకు చికిత్స అందిస్తున్నారు. జిల్లాలో కడప, ప్రొద్దుటూరు, పులివెందుల, జమ్మలమడుగు, బద్వేలు, మైదుకూరులో 36 ప్రైవేటు ఆసుపత్రులు ఆరోగ్యశ్రీ పరిధిలో ఉన్నాయి. వీటిల్లో కడపలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు ఉన్నాయి. కాళ్లు చేతులు విరిగినప్పుడు అవసరమైన ప్లేట్లు, గుండెకు సంబంధించిన స్టంట్స్ కంటికి సంబంధించి ఇతరత్రా ఆపరేషన్లు, లేజర్లు వాటికి ప్రైవేటు ఆసుపత్రుల్లోనే కొనుగోలు చేసి రోగులకు అందిస్తున్నాయి. వీటికోసం ప్రైవేటు ఆసుపత్రులు తొలుత పెట్టుబడిపెడుతున్నాయి. నెలనెలా బిల్లులు వస్తుంటే ఆరోగ్యశ్రీ ద్వారా పెట్టిన ఖర్చు తిరిగి వచ్చేది. అయితే నెలల తరబడి బిల్లులు పేరుకుపోవడం వారికి భారంగా మారింది. సూపర్ స్పెషాలిటీలో ఉండే వైద్యులకు వేతనాలు, ఇతర స్టాఫ్‌కు, కరెంటు బిల్లులు, అద్దెలు ఇలాంటివన్నీ ఆసుపత్రిని బట్టి నెలనెలా రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షలకు పైగా నిర్వహణ ఖర్చు ఉంటుంది. అయితే ఆరోగ్యశ్రీ ద్వారా వచ్చే బిల్లులు పేరుకుపోవడంతో నిర్వహణ వ్యయం భారంగా మారింది. దీంతో సమ్మె బాట పట్టారు.

15 ఆసుపత్రుల తొలగింపు

సమ్మె నోటీసు ఇచ్చిన ఆసుపత్రులపై జగన్ ప్రభుత్వం కత్తి దూసింది. వెంటనే వాటిని ఆరోగ్యశ్రీ నుంచి తొలగించింది. కడపలో సీఎం జగన్ మేనమామ రవీంద్రనాధరెడ్డి కూతురు నాగరాజుపేటలో సన్‌రైజ్ హాస్పిటల్ నిర్వహిస్తున్నారు. దీంతో పాటు జిల్లాలో మల్టీ, సూపర్ స్పెషాలిటీ ఆస్రత్రులు 15 వాటిని ఆరోగ్యశ్రీ నుంచి తొలగించారు. సన్‌రైజ్, ఎంఎం, భారతి, హోలిస్టిక్, మరికొన్ని ఆసుపత్రులను నెట్‌వర్క్ తొలగించారు. ఇప్పుడు రెండు ఆసుపత్రులకు మాత్రమే ఆరోగ్యశ్రీ ఉంది. యధావిధిగానే కొందరు రోగులు ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందేందుకు ఆసుపత్రులకు వెళితే అక్కడ ఆ సేవలు లేవని తెలియడంతో బాధితులు అవాక్కవుతున్నారు. వైద్యసేవలు నిలిచినచోట ఆసుపత్రులు ఫ్లెక్సీ ద్వారా బోర్డులు ఏర్పాటు చేశారు. కొందరు డబ్బులు ఇచ్చి వైద్యం చేయించుకుంటున్నారు. పెండింగుల బిల్లులు రాక ఆసుపత్రివర్గాలు అవస్థలు పడుతున్నారు.

నవమోసాల్లో దిట్ట జగన్

- స్టీల్ ప్లాంట్‌కు చేతులెత్తేసిన కేంద్రం
- నోరు మెదపని ఎంపీలు మిథున్, అవినాశ్
- రేపు జిల్లాకు రానున్న వైఎస్ షర్మిల
- కాంగ్రెస్ పార్టీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి



మాట్లాడుతున్న పీసీసీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి

కడప(కలెక్టరేట్), జనవరి 27: రాయలసీమ ప్రజలకు నవమోసాలు, ద్రోహం చేయడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి దిట్ట అని మాజీ రాజ్యసభ సభ్యుడు, రాష్ట్ర మీడియా సెల్ చైర్మన్ తులసిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన నగర అధ్యక్షుడు విష్ణుప్రీతం రెడ్డి, పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నజీర్ అహమ్మద్‌తో కలసి పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో స్టీల్‌ఫ్యాక్టరీ నిర్మాణానికి కేంద్రం చేతులెత్తేసిందన్నారు. ఆర్థిక వ్యవహారాలతో కూడుకున్నదని సాధ్యం కాదని కేంద్ర తేల్చడం బాధాకరమన్నారు. కడప-బెంగళూరు రైల్వేలైన్ పనులను 2007లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 50-50 శాతం వాటాలతో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రారంభించారన్నారు. ఆయన తనయుడు ప్రస్తుత ముఖ్యమంత్రి ఆ రైల్వే లైనే తమకు వద్దంటూ కేంద్రానికి లేఖరాసి సీమ వాసులకు తీరని ద్రోహం చేశాడన్నారు. ఇంత తతంగం జరుగుతున్నా మనకు ఉన్న ఇద్దరు ఎంపీలు మిథున్‌రెడ్డి, వైఎస్ అవినాశ్ రెడ్డిలు సీమప్రజల పక్షాన నోరుమెదపక ద్రోహం చేశారని విమర్శించారు. వీరిని ఈ దఫా చిత్తుగా ఓడించాలన్నారు. కాగా.. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల 29వ తేదీ సోమవారం జిల్లాకు రానున్నారని అన్నారు. అనంతపురం నుంచి బయలుదేరి ఉదయం 10 గంటలకు కడపలోని పులివెందుల రోడ్డులో ఉన్న జయరాజ్ గార్డెన్‌కు చేరుకుంటారన్నారు. 12-30 వరకు అన్నమయ్య, కడప జిల్లాల కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలతో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సమావేశం అవుతారన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి అనుసరించాల్సిన వ్యూహాలపై దిశా నిర్దేశం చేయనున్నారు. అనంతరం ఆమె కర్నూలు వెళతారని తులసిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి చీకటి చార్లెస్, పీసీసీ మహిళా ఉపాధ్యక్షురాలు శ్యామలమ్మ, మాజీ మహిళా ఉపాధ్యక్షురాలు సుజాతా రెడ్డి, ఎన్ఎస్‌యూఐ జాతీయ ఉపాధ్యక్షుడు ధ్రువకుమార్‌రెడ్డి, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

'ఆత్మ'లకూ ఓట్లు..!



మైదుకూరు, జనవరి 27: ఎన్నికల సంఘం తాజాగా విడుదల చేసిన ఓటరు జాబితా కూడా తప్పుల తడకగా ఉంది. ఇందులో కూడా మృతిచెందిన వారికి కూడా ఓటు ఉండటం, ఒకే ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులకు వేర్వేరు ప్రాంతాల్లో ఓటు ఉండటం ఇప్పటి వరకు కొన్ని మాత్రమే బయటకు వచ్చాయి. ఇలాంటి ఓట్లు ఇంకా ఎన్ని ఉన్నాయవిచారణలో తేలియాల్సి ఉంది. మైదుకూరు మండలం వనిపెంట పోలింగ్ కేంద్రంలో 553 వరుస సంఖ్యగల ఓటు సుంకర మాబున్ని ఆరు నెలల క్రితం మృతి చెందారు. అలాగే ఇదే కేంద్రంలో 737 వరుస సంఖ్యగల తడికెల మాబుసాబ్ రెండు నెలల క్రితమే మృతి చెందాడు. అయినా తుది జాబితాలో వీరు పేర్లున్నాయి.

అలాగే మున్సిపల్ పరిధిలోని లింగాల దిన్నె 76వ పోలింగ్ కేంద్రంలో వరుస సంఖ్య 572లో కొమరకాల్వ రామక్క ఓటు ఉంది. ఈమె 2 నెలల క్రితం మృతి చెందారు. 287 వరుస సంఖ్యలో ఉన్న చాగలమర్రి పాపులమ్మ ఏడాది క్రితం మృతి చెందినా ఆమె ఓటు అలాగే ఉంది. యాపరాల పెద్ద సుబ్బన్న, నల్లమారు బాలయ్య కూడా మృతి చెంది ఏడాది అవుతున్నా.. ఇప్పటికీ వారి ఓట్లు ఓటరు జాబితాలో ఉన్నాయి.


ఖాజీపేట మండలంలో...

ఖాజీపేట మండలం కువ్వురకొట్టాలు పోలింగ్ కేంద్రం 174లో వరుస సంఖ్య 96లో గోసల నవనంద కుమార్‌రెడ్డి ఇంటి నెంబరు తప్పుగా ముద్రించడంతో పాటు ఇంటి సంఖ్య స్థానంలో రాష్ట్రం పేరు ఉంది


బ్రహ్మంగారిమఠం మండలంలో..

ఒకొక్కరికి రెండు నుంచి 4 చోట్ల ఓటు ఉన్నట్లు తుది జాబితాలో ఇప్పటి వరకు వెలుగులోకి వచ్చాయి. లెక్కల రమణారెడ్డికి చౌదరివారిపల్లె, కందిమల్లాయపల్లెలో రెండు చోట్ల ఓటు ఉన్నట్లు జాబితాలో ఉంది. రామచంద్రాపురంలో బోయపాటి చిన్న సుబ్బయ్యకు ఏకంగా వేర్వేరుగా 3 ఓట్లున్నాయి. అలాగే బోయపాటి ఆదిలక్షుమ్మకు రెండు ఓట్లు ఉన్నాయి. అలాగే చౌదరివారిపల్లెలో లెక్కల వెంకటశివారెడ్డికి చౌదరివారిపల్లె, కందిమల్లాయపల్లెలో ఓటు ఉన్నట్లు తాజాగా విడుదల అయినా జాబితాలో ఉంది. అన్ని ఊర్లల్లో జాబితాలు పరిశీలిస్తే ఇంకెన్ని అవకతవకలు వెలుగు చూస్తాయో.

జాబితాలో ఉన్న మృతి చెందిన సుంకర మాబున్ని




- ఒక్కొరికి రెండు నుంచి 4 ఓట్లు
- సవరింపులు చేసినా తప్పులే
- తప్పుల తడకగా ఓటరు జాబితా



బి.మఠం మండలంలో మూడు ఓట్లు ఉన్న బోయపాటి చిన్న సుబ్బయ్య

పాపాల పెద్దిరెడ్డీ.. ఎలా గెలుస్తావో చూస్తా



ప్రజలకు చంద్రబాబు అభివాదం

- ఇంత కాలం నా దయాదాక్షిణ్యాలతో గెలిచావ్
- ఇసుక దందా, ప్రభుత్వ భూముల కబ్జాల్లో ఆరితేరిన వైసీపీ ఎమ్మెల్యేలు
- అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయినా జగన్ పట్టించుకోలేదు
- పీలేరు సభలో చంద్రబాబు నాయుడు

పీలేరు, జనవరి 27: 'పాపాల పెద్దిరెడ్డీ... ఇంత కాలం నా దయాదాక్షిణ్యాలతో గెలుస్తూ వచ్చావ్. వచ్చే ఎన్నికల్లో నా తడాఖా చూపిస్తా. ఇకపై పుంగనూరులో ఎలా గెలుస్తావో చూస్తా' అంటూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాజంపేట పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో టీడీపీ-జనసేన అభ్యర్థులను గెలిపించాలని కార్యకర్తలు, ప్రజలకు పిలుపునిచ్చారు.

రాజంపేట పార్లమెంటు పరిధిలోని పీలేరులో శనివారం జరిగిన 'రా...కదలిరా' బహిరంగ సభలో ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడారు. రాయలసీమ ప్రాంత అభివృద్ధికి ఆది నుంచి కట్టుబడి ఉన్నది కేవలం టీడీపీయేనని, ఎన్టీఆర్ హయాం నుంచి టీడీపీ ప్రభుత్వం ఉన్నన్నాళ్లూ రాయలసీమ అభివృద్ధి కోసం ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. టీడీపీ హయాంలో రాయలసీమ అభివృద్ధికి రూ.12,500 కోట్లు ఖర్చుపెట్టామన్నారు. గోదావరి నీటితో రాయలసీమ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలన్న దృఢసంకల్పంతో యుద్ధప్రాతిపదికన పట్టిసీమ ప్రాజెక్టు నిర్మించి గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు తెచ్చానన్నారు. అక్కడి నుంచి 120 టీఎంసీల గోదావరి నీటిని రాయలసీమలోకి తెచ్చిన ఘనత కూడా టీడీపీదేనన్నారు. ప్రతి ఏటా సముద్రంలో కలిసిపోయే 2 వేల టీఎంసీలను రాయలసీమకు తరలించేందుకు బానకచర్ల ద్వారా సీమకు తరలించేవాళ్లమని, అధికారం కోల్పోవడంతో ఆ అవకాశం కోల్పోయామన్నారు. రాయలసీమను పండ్ల తోటలకు హబ్‌గా తీర్చిదిద్దేందుకు అహర్నిశలు కృషి చేశామన్నారు. ప్రాజెక్టుల గురించి ఏనాడూ పట్టించుకోని జగన్ చరిత్రలో రాయలసీమ ద్రోహిగా మిగిలిపోతారన్నారు.

అన్నమయ్య ప్రాజెక్టుకు గ్రీసు కూడా పెట్టలేని సీఎం

కడప, అన్నమయ్య జిల్లాలకు తలమానికంగా ఉన్న అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయినా పట్టించుకోలేదన్నారు. ఆ ప్రాజెక్టు ముంపులో 40 మంది ప్రాణాలు కోల్పోయినా, 450 మంది ఇళ్లు నేలమట్టమైనా ఆయనలో చలనం లేకపోయిందన్నారు. ఆ ప్రాజెక్టు కొట్టుకుపోయి ఏళ్లు గడుస్తున్నా నిర్వాసితులకు ఇళ్లు కూడా నిర్మించి ఇవ్వలేని అసమర్థుడని విమర్శించారు. చివరకు ఆ ప్రాజెక్టు నిర్వాసితులందరికీ ఎన్టీఆర్ ట్రస్టు తరఫున ప్రతి ఒక్కరికీ రూ.లక్ష అందించి ఆదుకున్నామని గుర్తు చేశారు.



పీలేరులో జరిగిన రా..కదలిరా బహిరంగసభకు హాజరైన జనం

అక్రమార్జనే వారి లక్ష్యం

అన్నమయ్య జిల్లాలోని ప్రజాప్రతినిధులందరూ అక్రమార్జనే ధ్యేయంగా ఓట్లు వేసి గెలిపించిన ప్రజలను పీల్చి పిప్పి చేస్తున్నారన్నారు. రాజంపేట, రైల్వేకోడూరు ఎమ్మెల్యేలు మంగంపేట బెరైటీస్ గనుల్లో కుంభకోణాలు చేశారన్నారు. రాయచోటి ఎమ్మెల్యే భూఆక్రమణలు, తంబళ్లపల్లె ఎమ్మెల్యే ప్రభుత్వ భూములు, ఇసుక.. పీలేరు ఎమ్మెల్యే ఇసుక, క్వారీలు, భూఆక్రమణల్లో మునిగితేలుతున్నారన్నారు. పుంగనూరు ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనునిత్యం కుంభకోణాలు జరుపుతూ సుమారు రూ.35 వేల కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టారన్నారు. ఆయన ఉదయం అల్పాహారంగా ఇసుక, మధ్యాహ్నం భోజనంలో గనులు, రాత్రి భోజనంలో ఇరిగేషన్ ప్రాజెక్టుల్ని మింగేస్తున్నారన్నారు. పెద్దిరెడ్డి కుప్పం వెళ్లి తనను ఓడిస్తానని ప్రగల్భాలు పలుకుతున్నాడని అన్నారు. ఇంతకాలం తన దయాదాక్షిణ్యాలపై పెద్దిరెడ్డి గెలుస్తూ వచ్చారని, వచ్చే ఎన్నికల్లో పుంగనూరులో ఓడించి తన తడాఖా ఏమిటో ఆయనకు రుచి చూపిస్తానన్నారు. సంపూర్ణ మద్యపాన నిషేధం తెస్తానని ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చిన జగన్ అధికారంలోకి వచ్చాక మరో 25 ఏళ్ల పాటు దాని ఊసెత్తలేని విధంగా మద్యం అమ్మకాలను గ్యారెంటీగా చూపించి రూ.36 వేల రుణం తెచ్చుకున్నారన్నారు. మాట ఇచ్చి నిలబెట్టుకోలేని జగన్‌కు ముఖ్యమంత్రిగా కొనసాగే నైతిక అర్హత లేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి, పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్, ఎమ్మెల్సీలు రామగోపాల్‌రెడ్డి, కంచెర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్యేలు ఆర్.రమేశ్‌కుమార్‌రెడ్డి, జి.ద్వారకనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి, కడప జిల్లా టీడీపీ అధ్యక్షుడు లింగారెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ సుగవాసి బాలసుబ్రహ్మణ్యం, గంటా నరహరి, పంతగాని నరసింహప్రసాద్, సుగవాసి ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



వేదికపై చంద్రబాబుతో టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, నల్లారి కిశోర్



వేదికపై మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథరెడ్డి, టీడీపీ నాయకులు పర్వీన్‌తాజ్, ముక్కా రూపానందరెడ్డి



చంద్రబాబుతో పాటు బస్సు నుంచి దిగుతున్న జడ్పీ మాజీ చైర్మన్ సుగవాసి బాలసుబ్రమణ్యం

జన.. ప్రభంజనం...

పీలేరు సభకు పోటెత్తిన ప్రజలు

పీలేరు, జనవరి 27 : పీలేరులో శనివారం జరిగిన రా.. కదలిరా సభకు లక్షకు పైగా జనం రావడంతో జన.. ప్రభంజనంలా మారింది. జనంతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. దీంతో అంతకుమించి జనం సమీపంలోని జాతీయ రహదారిపై ఆగిపోవలసి వచ్చింది. పీలేరు నుంచి మదనపల్లెకు వెళ్లే జాతీయ రహదారి దాదాపు ఎనిమిది కిలోమీటర్ల పొడవునా వాహనాలు, అందులో వచ్చిన జనంతో రవాణా దాదాపు పూర్తిగా స్తంభించిపోయింది.



వైసీపీ అరాచక పాలన అంతమే ధ్యేయం

రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్ రాజు



రాష్ట్రంలో సాగుతున్న వైసీపీ అరాచక, విధ్వంస పాలన అంతమే తమ ధ్యేయమని రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్ రాజు అన్నారు. పీలేరులో జరిగిన 'రా...కదలిరా' సభలో ఆయన మాట్లాడుతూ నాలుగున్నరేళ్లుగా వైసీపీ నాయకుడు పెడుతున్న అనేక అక్రమ కేసులు ఎదుర్కొంటూ కూడా పార్టీ పట్ల నమ్మకం కలిగి ఉన్న కార్యకర్తలందరికీ పాదాభివందనం చేస్తున్నట్లు తెలిపారు. వైసీపీ పాలన కారణంగా అభివృద్ధిలో 30 ఏళ్ల వెనక్కు వెళ్లిపోయిన రాష్ట్రం బాగుపడాలంటే చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. పీలేరు సభకు హాజరైన జనసమూహాన్ని చూసి తాడేపల్లె ప్యాలెస్‌లోని జగన్, పుంగనూరు పుడంగి పెద్దిరెడ్డి గుండెల్లో రైళ్లు పరుగెడుతుంటాయన్నారు. అధికారంతో గత నాలుగేళ్లుగా మద్యం, ఇసుక అక్రమ వ్యాపారాల్లో సంపాదించిన డబ్బు సంచులతో మళ్లీ ప్రజలను మోసం చేసేందుకు వైసీపీ నాయకులు వస్తారని వారి మాయమాటలు నమ్మి మోసపోవద్దని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వచ్చే ఎన్నికల్లో రాజంపేట పార్లమెంటు సీటుతో పాటు దాని పరిధిలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లోనూ టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

ల్యాండ్, శ్యాండ్, మైన్‌తో వైసీపీ దోపిడీ

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్



వైసీపీ వారు ల్యాండ్, శ్యాండ్, మైన్-వైన్‌లతో రాష్ట్ర ప్రజలను లూటీ చేస్తున్నారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి పీలేరు సభలో ధ్వజమెత్తారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే తప్ప వైసీపీ పాలనలో 30 ఏళ్లు వెనక్కు వెళ్లిపోయిన రాష్ట్రాన్ని మళ్లీ గాడిలో పెట్టలేరన్నారు. పీలేరు నియోజకవర్గంలోని యువత కోసం తాము ఏపీఐఐసీ అధ్వర్యంలో సుమారు 2 వేల ఎకరాలు సేకరిస్తే వాటిలో పరిశ్రమలు స్థాపించకుండా ఇక్కడి ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రి పెద్దిరెడ్డి అన్యాయం చేశారన్నారు. పీలేరు నియోజకవర్గంలోని అన్ని మండలాలకు నీరిచ్చే ఝరికోన ప్రాజెక్టును కూడా పట్టించుకోలేదన్నారు. రాజంపేట ఎంపీ స్థానంతో పాటు దాని పరిధిలోని అన్ని ఎమ్మెల్యే స్థానాలను టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. తమ కుటుంబంపై ఎనలేని ప్రేమ, అభిమానం చూపిస్తున్న పీలేరు నియోజకవర్గ ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానని భావోద్వేగానికి లోనయ్యారు. పీలేరు సభను విజయవంతం చేసిన రాజంపేట పార్లమెంటు పరిధిలోని అన్ని అసెంబ్లీ సెగ్మెంట్ల టీడీపీ శ్రేణులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజలే జగన్‌ను ట్రాన్స్‌ఫర్ చేస్తారు

● కంచెర్ల శ్రీకాంత్, ఎమ్మెల్సీ



ఎమ్మెల్యేలు, ఎంపీలను ట్రాన్స్‌ఫర్ చేస్తున్న జగన్‌ను రాష్ట్ర ప్రజలు త్వరలో రాష్ట్రం నుంచి ట్రాన్స్‌ఫర్ చేసేందుకు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే కంచెర్ల శ్రీకాంత్ తెలిపారు. నా వెంట్రుక కూడా పీకలేరని డాంబికాలు పలికిన జగన్, ప్రస్తుతం జనాగ్రహాన్ని గ్రహించి సంతోషంగా దిగిపోతానని ఓటమిని అంగీకరిస్తున్నారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలను స్ఫూర్తిగా తీసుకుని వచ్చే ఎన్నికల్లో రాజంపేట పార్లమెంటు పరిధిలోని అన్ని సెగ్మెంట్లలో టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

గంజాయాంధ్రప్రదేశ్‌గా మార్చేశారు

పసుపులేటి హరిప్రసాద్, జనసేన చిత్తూరు జిల్లా అధ్యక్షుడు



దేశానికే అన్నపూర్ణగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను ముఖ్యమంత్రి జగన్ గంజాయాంధ్రప్రదేశ్‌గా మార్చివేశారు. దేశంలో ఎక్కడ గంజాయి కేసులు బయటపడినా వాటి మూలాలు ఆంధ్రప్రదేశ్‌లో తేలుతున్నాయన్నారు. ఆయన నేతృత్వంలోని వైసీపీ గంజాయి, ఎర్రచందనం, లిక్కర్, ఇసుక మాఫియాగా మారిపోయిందని, ముఖ్యమంత్రి జగన్ మాఫియా డాన్‌గా మారిపోయారని తెలిపారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా రాష్ట్ర ప్రజలు టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నారని, చిత్తూరు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఉమ్మడి అభ్యర్థులు విజయబావుటా ఎగురవేస్తారని అన్నారు.

నాతోనే అంతమవుతావ్

చల్లా రామచంద్రారెడ్డి, పుంగనూరు



'1989లో నాపై గెలిచి రాజకీయ జీవితం ప్రారంభించావ్, ఈ ఎన్నికల్లో నా చేతుల్లో ఓడిపోయి రాజకీయంగా అంతమైపోతావ్' అంటూ మంత్రి పెద్దిరెడ్డిపై పుంగనూరు ఇన్‌చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి(చల్లా బాబు) పీలేరు సభలో ఫైర్ అయ్యారు. పీలేరు సభను చూస్తుంటే ముఖ్యమంత్రి జగన్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వెన్నులో వణుకు పుట్టిస్తోందన్నారు. పీఎల్ఆర్ సంస్థ పేరుతో రైతులకు ఒక్కరూపాయి నష్టపరిహారం చెల్లించకుండా అక్రమంగా ప్రాజెక్టులు నిర్మిస్తున్నారని ఆరోపించారు. వారిద్దరి అధికారం అంతం అయ్యే సమయం ఆసన్నమైందన్నారు.

చంద్రబాబు సభలో హైలైట్స్

కలికిరి/కలకడ, జనవరి 27: శనివారం పీలేరులో జరిగిన టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు భారీ బహిరంగ సభ అనుకున్నదానికి మించి విజయవంతమైంది. రాజంపేట పార్లమెంటు పరిధిలో జరిగిన ఈ సభకు రాజంపేట, కోడూరు, రాయచోటి, మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, పుంగనూరు నుంచి జనాలు హాజరయ్యారు. లక్షకు పైబడి జనం హాజరయ్యారని చెబుతుండగా అందులో సగం మంది జాతీయ రహదారిపై ఏడెనిమిది కిలోమీటర్ల మేర ఇరుక్కుపోయారు. మొత్తానికి జనసందోహాన్ని చూసిన పార్టీ వర్గాలు మాత్రం ఉబ్బితబ్బియ్యారు. ఇక సభలో కనపడిన విశేషాలు..

- వాతావరణం ఆహ్లాదకరంగా మారడంతో ప్రకృతి కూడా సహకరించిందని వేదికపై నుంచి పలువురు సంతోషం వ్యక్తం చేశారు.
- అవసరమైన వారందరికీ అడుగడుగునా మంచినీళ్లు, మజ్జిగ ప్యాకెట్లు విస్తృతంగా అందుబాటులో ఉంచారు.
- చంద్రబాబు షెడ్యూలు మేరకు సరిగ్గా 11.50 గంటలకు హెలికాప్టర్ ద్వారా సభా ప్రాంగణానికి చేరుకున్నారు. 12.20కి వేదిక పైకి వచ్చారు. 12.44కు ఉపన్యాసం ప్రారంభించి దాదాపు గంటకు పైబడి మాట్లాడారు.
- సభ జరుగుతున్న మైదానం పైన ఐదారు డ్రోన్లు నిరవధికంగా సంచరిస్తూ కనిపించాయి. ఇందులో పోలీసులకు చెందిన డ్రోన్ కూడా ఉందని చెబుతున్నారు. అతి పెద్ద డ్రోన్ ఒకటి చంద్రబాబు ప్రయాణిస్తున్న హెలిక్యాప్టర్ పైభాగంలో దానిని అనుసరిస్తూ వచ్చింది.
- సభా స్థలిలో జనాన్ని నియంత్రించకపోవడంతో బారికేడ్లు మొత్తం చెల్లాచెదురయ్యాయి. దీంతో జనం ఒక్కసారిగా వేదిక వద్దకు పోటెత్తారు. పెద్ద సంఖ్యలో యువకులు టీడీపీ జెండాలు చేతబట్టి జై జై నినాదాలు కొనసాగించారు. దీంతో చంద్రబాబు తన ప్రసంగాన్ని చాలాసేపు ఆపేశారు.
- సభ జరుగుతున్న మైదానంపైన చంద్రబాబు, కిశోర్‌కుమార్‌రెడ్డి ఫొటోలతో కూడి బెలూన్లు ఎగురవేశారు
- చంద్రబాబు ప్రసంగం సగం పూర్తయినా జాతీయ రహదారిపై నుంచి జనం సభా స్థలికి క్యూ కట్టి వస్తూనే కనిపించారు.
- సరిగ్గా 12.50 మైకులు పనిచేయక ఆగిపోయాయి. వేదిక వద్దకు జనాలు చేరడంతో మైకులకు అంతరాయం కలిగింది. పది నిమిషాల తరువాత పునరుద్ధరించారు.
- బారికేడ్లు ఛేధించుకుని జనం ఒక్క పెట్టున వేదిక ముందుకు రావడంతో జనంలో కసి బాగా కనిపిస్తోంది.
- పీలేరు గర్జిస్తోంది.. ఇక యుద్ధానికి సిద్ధం.. కురుక్షేత్ర సంగ్రామానికి సంసిద్ధం అంటూ పదే పదే చంద్రబాబు ఆవేశంగా ప్రసంగించారు.

సార్...మీరు కాసింత లిబరల్‌గా ఉండాలి!

● చంద్రబాబుకు నల్లారి అమరనాథరెడ్డి విజ్ఞప్తి

'సార్, మీరు పరిపాలనలో స్ట్రిక్టుగా ఉండండి. కార్యకర్తల విషయంలో కాస్త లిబరల్‌గా ఉండాలి. గడిచిన ఐదేళ్లలో మన పార్టీ వాళ్లను వైసీపీ వారు అనేక ఇబ్బందులు పెట్టారు. మనం అధికారంలోకి వచ్చిన తరువాత వారి లెక్క తేల్చాలి. అక్రమంగా కేసులు పెట్టిన వారి భరతం పట్టాలి. ఆ సమయంలో మీరు మా మాట వినాలి. మీరు స్ట్రిక్టుగా ఉంటే కార్యకర్తలు నొచ్చుకుంటారు. వైసీపీకి చివరి రోజులు నడుస్తున్నాయని, త్వరలో జరిగే ఎన్నికల తరువాత అది శాశ్వతంగా మూతపడిపోతుందన్నారు. ఇప్పటికే ఆ పార్టీకి అభ్యర్థులు దొరకడం లేదన్నారు. స్వంత చెల్లెలుకు న్యాయం చేయలేని వాడు తమకు ఎటువంటి సాయం చేయలేడన్న నిర్ణయానికి రాష్ట్ర ప్రజలు వచ్చేశారన్నారు.





పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ సుగవాసి బాలసుబ్రమణ్యం మాటామంతి



వేదికపై టీడీపీ నాయకుడు గంటా నరహరి, మాజీ ఎమ్మెల్యే రమేశ్‌రెడ్డి



వేదికపై టీడీపీ అధినేత చంద్రబాబుతో పాటు టీడీపీ నాయకులు జగన్‌మోహన్‌రాజు, చల్లా రామచంద్రారెడ్డి, నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి

దగ్గుబాటి కుమారుడి తొలి జీతం ఎన్టీఆర్ ట్రస్టుకు విరాళం

కలికిరి, జనవరి 27: పీలేరు నియోజకవర్గ టీడీపీ నాయకుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు కుమారుడు దగ్గుబాటి పునీత్ తన తొలి వేతనాన్ని ఎన్టీఆర్ ట్రస్టుకు విరాళంగా అందజేశారు. శనివారం పీలేరులో జరిగిన రా.. కదలి రా.. సభలో ఆయన నేరుగా ఇందుకు సంబంధించిన చెక్కును చంద్రబాబు నాయుడుకు అందజేశారు. 2022 జూలై 7న టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు రాజంపేట పార్లమెంటు పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల సమీక్షా సమావేశాలను కలికిరిలో నిర్వహించారు. ఈ సమావేశాలకు ముందు ఉదయం ఆయన నగరిపల్లెలోని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి ఇంటికి అల్పాహారానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు తన కుమారుడు దగ్గుబాటి పునీత్‌ను చంద్రబాబుకు పరిచయం చేశారు. ఇంజినీరింగ్ చదువుతున్నానని, ఉద్యోగంలో చేరగానే తన మొదటి నెల జీతాన్ని ఎన్టీఆర్ ట్రస్టుకు విరాళంగా ఇవ్వాలని నిర్ణయించినట్లు పునీత్ చెప్పారు. ఆ సందర్భంలో పునీత్ నిర్ణయాన్ని స్వాగతిస్తూ చంద్రబాబు అభినందించారు. అనుకున్నట్టుగానే పునీత్ గత డిసెంబరు నెలలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా చేరారు. జనవరిలో మొదటి జీతం తీసుకున్నారు. కాకతాళీయంగా శనివారం పీలేరు సభకు చంద్రబాబు రానుండటంతో గతంలో ఇచ్చిన హామీ మేరకు మొదటి నెల జీతం మొత్తానికి ఎన్టీ ఆర్ ట్రస్టు పేరు మీద రాసిన రూ.1,10,000ల చెక్కును చంద్రబాబుకు అందజేశారు. టీడీపీ యువనాయకుడు నల్లారి అమరనాథ రెడ్డి, తండ్రి వెంకటేశ్వర రావుల సమక్షంలో వేదికపైన చెక్కును అందుకున్న చంద్రబాబు ఒకింత ఆశ్చర్యం వ్యక్తం చేసి ఆ వెంటనే మాట నిలుపుకున్నందుకు అభినందించారు. ఉజ్వల భవిష్యత్తు లభించాలని ఆశీర్వదించారు.



చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న దగ్గుబాటి పునీత్, వెంకటేశ్వరరావు

రోడ్డు ప్రమాదంలో టీడీపీ నాయకుడు మృతి

వేముల, జనవరి 27: మండలంలోని వి.కొత్తపల్లె గ్రామానికి చెందిన టీడీపీ యువనాయకుడు వెంకటరామిరెడ్డి (35) శుక్రవారం అర్ధరాత్రి వేంపల్లె మండలం నందిపల్లె గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. శుక్రవారం రాత్రి వేంపల్లె నుంచి తన స్వగ్రామమైన వి.కొత్తపల్లెకు బైక్‌లో వస్తుండగా నందిపల్లె వద్ద బైక్‌లో నుంచి కిందపడగా ఇది గమనించిన వాహనదారులు హుటాహుటిన 108 వాహనంలో వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం కడపకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్సకై బెంగుళూరుకు తరలించారు. బెంగుళూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం 10 గంటలకు మృతి చెందినట్లు వారి బంధువులు తెలిపారు. వెంకటరామిరెడ్డికి ఈ మధ్యనే వివాహం కూడా ఖరారు కావడం వచ్చే నెలలో పెళ్లి కూడా చేయాలని వారి తల్లిదండ్రులు నిర్ణయించారు. అంతలోనే రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో వారి కుటుంబ సభ్యులు శోకసముద్రంలో మునిగిపోయారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారధిరెడ్డి, మండల టీడీపీ నాయకులు సంతాపం తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

జమ్మలమడుగు, జనవరి 27: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని నాగులకట్ట వీధి చౌడేశ్వరీ దేవాలయం ఎదురుగా రైల్వేస్టేషన్ వెళ్లే ఖాళీ వెంచర్లలో జంకానం మహబూబ్‌బాష (45) అనే వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... మృతుడు జమ్మలమడుగు మండలం గూడెం చెరువు పంచాయతీ పరిధిలోని రాజీవ్‌నగర్ కాలనీలో నివాసం ఉన్నాడు. ఇతడి భార్య మూడు సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. ఇద్దరు మగపిల్లలున్నారు. ఒకరు ఇంటర్ చదువుతుండగా మరొకరు నాలుగు సంవత్సరాలు కలిగి ఉన్నాడని తెలిపారు. కాగా శుక్రవారం రాత్రి 12 గంటల సమయంలో జమ్మలమడుగు అర్బన్ పోలీసులకు గుర్తు తెలియని మృతదేహం కలిగి ఉందని సమాచారం వచ్చింది. వెంటనే స్పందించిన పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లారు. స్థానిక పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు కడప నుంచి క్లూస్ టీం వచ్చి పరిశీలించారు. మృతుడు బేల్దారి పనులు చేసుకుని జీవించేవాడు. ఇటీవల ఇంటిని దాదాపు రూ.8 లక్షలకు విక్రయించినట్లుగా మృతుడి బంధువులు తెలిపారు. ఇతడి గొంతుపై, తలకు, మర్మాంగాల వద్ద రక్తగాయాలయ్యాయి. జమ్మలమడుగు అర్బన్ పోలీసులు, అధికారులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

గాలివీడు, జనవరి27: పీలేరులో జరిగిన చంద్రబాబు బహిరంగ సభకు హాజరై తిరిగి వస్తుండగా మహల్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు, బంధువుల కథనం మేరకు.. గాలివీడు మండలం గోరాన్‌చెరువు పంచాయతీ బీసీ కాలనీకి చెందిన రామాంజనేయులు (23), గణేశ్ శనివారం ఉదయం బైకుపై పీలేరులో రా.. కదలిరా.. సభకు వెళ్లారు. సభ పూర్తయిన తర్వాత తిరిగి వస్తుండగా మహల్ సమీపంలో కలకడ నుంచి వస్తున్న లారీ ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన వారిని స్థానికులు 108 ద్వారా పీలేరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా రామాంజనేయులు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మరో యువకుడికి రెండు కాళ్లు విరగడంతో తిరుపతికి తరలించినట్లు తెలిపారు. మృతుడు రామాంజులు తెలుగుదేశం పార్టీ అంటే అభిమానమని అతనికి తండ్రి కూడా లేడని తల్లి ఆవేదన వ్యక్తం చేసింది.



రామాంజనేయులు (ఫైల్)

ఏఐసీటీఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

కడప (ఎడ్యుకేషన్), జనవరి 27 : పేద విద్యార్థులు చదువుతున్న బీబీఏ, బీసీఏ, జీఎంహెచ్ కోర్సులను ఏఐసీటీఈతో అనుసంధానం చేయడం వల్ల డిగ్రీకళాశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారి పేద విద్యార్థులకు విద్య అందని ద్రాక్షలా మారుతుందని వెంటనే ఏఐసీటీఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని పీఎస్‌టియు రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. శనివారం కడప నగరం ఆ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కేంద్రం తెచ్చిన ఎన్ఈపీ వల్ల ప్రాథమిక విద్యవ్యవస్థ సర్వనాశనం అయిందన్నారు. నూతనవిద్యావిధానంలభాంగా ఏఐసీటీఈ పరిధిలోకి బీబీఏ, బీసీఏ, డీఎంహెచ్ కోర్సులను తేవడం వల్ల ఈ ప్రభావం డిగ్రీ విద్యపై పడుతుందని చెప్పారు. ఏఐసీటీఈ పరిధిలోని ఎంబీఏ, ఎంసీఏ, ఫార్మసీ కళాశాలల్లో అధిక ఫీజులు చెల్లించలేక పేద విద్యార్థులు డిగ్రీ వైపు వెళుతున్నారన్నారు. పేద మధ్యతరగతి విద్యార్థులకు తక్కువ ఫీజులతో ఇటువంటి కోర్సులు అందిస్తున్న డిగ్రీకళాశాలలపై ఎలాంటి భారం మోపడం సరైంది కాదన్నారు. డిగ్రీ విద్యార్థులను ఉన్నత చదువులకు దూరం చేసి నూతన జాతీయ విద్యావిదానంలో భాగమైన ఏఐసీఈటీపై పునరాలోచన చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రకాశ్, ఆనంద్, భాస్కర్ పాల్గొన్నారు.

రాజంపేటలో నకిలీ పోలీసు అరెస్టు



నకిలీ పోలీసును చూపుతున్న సీఐ మద్దయ్య ఆచారి, నకిలీ పోలీసు వద్ద స్వాధీనం చేసుకున్న ఐడీ కార్డులు

రాజంపేట, జనవరి 27 : పోలీసునని చెప్పుకుంటూ రాజంపేట ప్రాంతంలోని విద్యానగర్ చుట్టుపక్కల అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న బద్వేలు పట్టణానికి చెందిన శివయ్య అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు రాజంపేట పట్టణ సీఐ మద్దయ్య ఆచారి తెలిపారు. శనివారం రాజంపేటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. పోలీసు యూనిఫాం పోలిన దుస్తులు వేసుకొని విద్యా నగర్ ప్రాంతంలో వాహనాలు తనిఖీ చేసి, డబ్బులు వసూలు చేస్తున్నాడన్న సమాచారంతో అతన్ని పట్టుకున్నామన్నారు. ఐ

అతనికి పోలీసు డిపార్ట్‌మెంటుకు ఎటువంటి సంబంధం లేదన్నారు. మూడు నకిలీ ఐడీ కార్డులు, వాకీటాకీ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇతనిపై కేసు నమోదు చేసి పూర్తిస్థాయి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మోహన్‌గౌడ్, ఏఎస్ఐ ప్రసాద్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఇద్దరు విద్యార్థులు ఎంపిక

చాపాడు, జనవరి 27: మండలంలోని అయ్యవారిపల్లె గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కమీరున్, గోవర్ధన్ అనే విద్యార్థులు రోప్‌స్కిప్పింగ్‌లో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఆ పాఠశాల హెడ్మాస్టర్ రమణ తెలిపారు. ప్రొద్దుటూరు పట్టణంలోని జార్జ్‌క్లబ్‌లో స్కూల్‌గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 26న జిల్లాస్థాయి రోప్ స్కిప్పింగ్ ఆటలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీలు అండర్-14 విద్యార్థులకు నిర్వహించారు. ఈ పోటీల్లో అయ్యవారిపల్లె విద్యార్థులను అధికారులు ఎంపిక చేశారు. ఈనెల 28న ఆదివారం తూర్పుగోదావరి జిల్లాలోని భీమవరంలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తున్నారు. కాగా కమీరున్ 7వ తరగతి, గోవర్ధన్ 8వ తరగతి చదువుతున్నాడు. పీఈటీ టీచర్ శివారెడ్డి, ఇతర ఉపాధ్యాయులు వారిని అభినందించి హర్షం వెలిబుచ్చారు.



విద్యార్థులను అభినందిస్తున్న హెడ్మాస్టర్

భూకబ్జాల్లో డిప్యూటీ సీఎం దిట్ట

● టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, కడప ఇన్‌చార్జ్ మాధవీరెడ్డి ● టీడీపీలో చేరిన ముస్లింలు

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 27: కడప నగరంలో భూకబ్జాలు చేయడంలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా దిట్ట అని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, టీడీపీ కడప ఇన్‌చార్జ్ ఆర్.మాధవీరెడ్డి ఆరోపించారు. అమాయక ప్రజల స్థలాల మొత్తం కబ్జాకు గురయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం కడప నగరం 25వ డివిజన్‌లో ముస్లింలు భారీ ఎత్తున టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, ఇన్‌చార్జ్ ఆర్.మాధవీరెడ్డి టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం వస్తే డిప్యూటీ సీఎం చేసిన అవినీతి మొత్తం బయటికి తీస్తామన్నారు. డిప్యూటీ సీఎం నిర్మించకునే లేఅవుట్లలో ప్రభుత్వ భూమి కబ్జాతో పాటు తమ్ముడు, అల్లుడు చేసిన అవినీతి కూడా బయటికి తీస్తామన్నారు. అవినీతి చేసిన అంజద్‌బాషా అండ్ కోను జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. నగరంలో అభివృద్ధి పేరుతో వ్యాపారులను సర్వనాశనం చేశారన్నారు. వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పూర్తిగా పెరిగిందని, ఆ పార్టీకి కాలం చెల్లిందన్నారు. స్థానిక ఎమ్మెల్యేకు తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గరడ్డాయన్నారు. టీడీపీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, రాబోవు ఎన్నికల్లో టీడీపీ విజయం తథ్యమన్నారు. టీడీపీలో చేరిన వారిలో షేక్ షబ్బార్ హసేన్, ఖౌశిక్ ఉస్సేన్, మున్వర్ హుసేన్, జెడికే హుసేన్, షోయబ్, బాషాఉసేన్, యూనస్ హుసేన్, ఖాదర్‌బాషా, షేక్ నవాజ్, అబిద్, షేక్‌బాషా, జాఫర్, షేక్ కరీం, షేక్ ఇదయత్ హుసేన్, షేక్ ఖాజా, సమీర్, కరీముల్లా తోపాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో శ్రీనివాసరెడ్డి, మాధవీరెడ్డి

టీడీపీతోనే అన్నివర్గాల ప్రజలకు న్యాయం

టీడీ పీతోనే అన్నివర్గాల అభివృద్ధి సాధ్యమని టీడీపీ కడప నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆర్.మాధవీరెడ్డి, కడప జనసేన ఇన్‌చార్జ్ సుంకర శ్రీనివాస్ తెలిపారు. శనివారం కడప నగరం 26వ డివిజన్ మాసాపేట సర్కిల్ నుంచి బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ హయాంలో ఎస్సీ, ఎస్టీలకు అనేక సబ్సిడీ రుణాలతో పాటు విదేశీ విద్య అవకాశం కల్పించారన్నారు. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వంలో ఎస్సీ ఎస్టీలపై దాడులు దౌర్జన్యాలు ఎక్కువయ్యాయన్నారు. టీడీపీ ప్రభుత్వం వస్తేనే అందరికీ శాంతి సమాధానాలతో పాటు అభివృద్ధి జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు సానపురెడ్డి శివకొండా రెడ్డి, నాయకులు మాసాపేట శివ, రహ్మతుల్లా, జయకుమార్, కొమ్మలపాటి సుబ్బరాయుడు, అనిల్, విశ్వనాద్, ప్రణవతి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అధికారంలోకి వస్తే అన్ని వర్గాల అభివృద్ధి

మహిళల్లో ఆత్మగౌరవం పెంచేందుకే మహాశక్తి పథకం: బీటెక్ రవి



బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో బీటెక్ రవి

పులివెందుల టౌన్, జనవరి 27: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే అన్ని వర్గాలకు సంక్షేమం-అభివృద్ధి ఫలాలు అందుతాయని నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి అన్నారు. పులివెందులలో శనివారం బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నగరిగుట్ట కాలనీలో నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేసి టీడీపీ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు వస్తున్న తరుణంలో ఓట్ల కోసం మోడల్ టౌన్ పేరుతో ప్రణాళికలు లేకుండా పనులు చేస్తున్నారన్నారు. దీనితో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి ఒక్క ఛాన్స్ అనిచెప్పి ప్రజాస్వామ్య వ్యతిరేక పాలనచేస్తున్నారన్నారు. రాష్ట్రాన్ని అధోగతి పాలుచేశారన్నారు. చంద్రబాబు ప్రవేశపెట్టనున్న ఆరు పథకాలతో ప్రజల భవిష్యత్‌కు గ్యారెంటీని చేకూరుస్తుందన్నారు. ఆడవాళ్ల ఆత్మగౌరవం పెంచేందుకు టీడీపీ అమలు చేస్తున్న మహాశక్తి పథకం అని, ఆ పథకం గురించి మహిళలకు వివరించారు. సంక్షేమం-అభివృద్ధి రెండు కళ్లలా భావించి పాలనఅందించే చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిని చేసుకొని రాష్ట్రాన్ని అభివృద్ధిబాటలో పయనింపచేద్దామన్నారు. బీటెక్ రవి సతీమణి లతారెడ్డి ఇంటింటికి తిరుగుతూ మేనిఫెస్టో కరపత్రాలను పంచుతూ పథకాలను వివరించారు. టీడీపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ వచ్చాక కార్మికులకు సబ్సిడీ రుణాలు

వేంపల్లె, జనవరి 27: ఎలక్ట్రికల్, ప్లంబర్, తదితర కార్మికులకు టీడీపీ వచ్చాక ఉపాధి కోసం సబ్సిడీ రుణాలు అందిస్తుందని మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి తెలిపారు. వేంపల్లెలో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ యూనియన్ వార్షికోత్సవం పురస్కరించుకొని స్థానిక మెయిన్ బజార్‌లోని కార్యాలయంలోని కార్మికుల జండాను బీటెక్ రవి ఆవిష్కరించారు. ప్రైవేట్ అసోషియేషన్ అధ్యక్షులు మునికుమార్, కార్యదర్శి మహమ్మద్ గౌస్, సహాయ కార్యదర్శి ఎస్దాని, అల్లాని, టీడీపీ మండల పరిశీలకులు రఘునాథరెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

50 కేజీల గంజాయి సీజ్

చక్రాయపేట, జనవరి 27: మండలంలోని అద్దాలమర్రి క్రాస్ రోడ్డులోని చెక్ పోస్టు వద్ద వాహనాల తనిఖీలలో 50కేజీల గంజాయిని సీజ్ చేసినట్లు సీఐ గోవిందరెడ్డి తెలిపారు. శనివారం ఎస్పీ సిద్దార్ధ్ కౌశల్ ఆదేశాల మేరకు పులివెందుల డీఎస్పీ వినోద్‌కుమార్ పర్యవేక్షణలో ఆర్కేవ్యాలీ సీఐ గోవిందరెడ్డి, ఎస్ఐ రంగారావులకు రాబడిన సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ వేంపల్లె-రాయచోటి మెయిన్‌రోడ్డులోని అద్దాలమర్రి క్రాస్‌రోడ్డు చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా కారులో ఉన్న 50కేజీల గంజాయిని సీజ్ చేశామన్నారు. సత్యసాయిజిల్లా రెడ్డివారిపల్లె గ్రామానికి చెందిన దేవరకొండ చిన్నమల్లికార్జున, కునకుంట్ల గ్రామానికి చెందిన భీంపేట వెంకటనారాయణలు అరెస్టు చేసి వారితో పాటు వారికి సహకరించిన మరో ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. ఇరువురిని లక్కిరెడ్డిపల్లె జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టు నందు హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లుసీఐ తెలిపారు.

వేంపల్లెలో గోవా మద్యం పట్టివేత



మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న సీఐ చాంద్‌బాష

వేంపల్లె, జనవరి 27: గోవా నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని వేంపల్లెలో పోలీసులు పట్టుకున్నారు. స్థానిక హనుమాన్ జంక్షన్ వద్ద సీఐ చాంద్‌బాష ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా మద్యం బాటిల్లు పట్టుబడ్డాయి. సీఐ తెలిసిన వివరాలు ఇలా ఉన్నాయి. వేంపల్లెకు చెందిన ఓ వ్యక్తి స్థానికంగా టీ దుకాణం నడుపుకొంటున్నారు. ఆదాయం కోసం గోవా నుంచి మద్యం తెప్పించుకొని అమ్మేందుకు ప్రయత్నించగా పోలీసులు దాడులు చేసి పట్టుకున్నారు. వివిధ రకాల బ్రాండ్లకు చెందిన 164 బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వ్యవసాయ రంగంలో అధిక దిగుబడి

వీరపునాయునిపల్లె, జనవరి 27 : ప్రపంచంలో పెరుగుతున్న టెక్నాలజీ ద్వారా వ్యవసాయ రంగంలో అధిక దిగుబడి సాధించవచ్చని ఆర్ఎంసీ పీఎం కిసాన్ సెంటర్ ఎండీ ఇసుకపల్లె రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం ఎన్.పాలగిరి గ్రామంలోని ఆర్ఎంసీపీఎం కిసాన్ సెంటర్ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ తరగతులను నిర్వహించారు.

నేడు కూడా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

కడప (ఎడ్యుకేషన్), జనవరి 27 :వినియోగదారుల సౌకర్యార్థం ఆదివారం అయినప్పటికీ విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని విద్యుత్ శాఖ జిల్లా అధికారి రమణ తెలిపారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించి సంస్థ అభివృద్ధికి సహకరించాలన్నారు.

చంద్రబాబు సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారు

● టీడీపీ నాయకులు అమీర్‌బాబు, లక్ష్మీరెడ్డి, మన్మోహన్‌రెడ్డి


కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 27 : రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా మళ్లీ చంద్రబాబు కావాలని ప్రజలు కోరుకుంటున్నారని టీడీపీ సీనియర్ నాయకులు అమీర్‌బాబు, అలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డి, మన్మోహన్ రెడ్డిలు అన్నారు. శనివారం కడప నగరంలోని మోచంపేట శివాలయం నుండి వైవీ స్ట్రీట్, బీకేయం వీధి, పెద్ద దర్గా వరకు బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎక్కడ చూసినా ఏ షాపు యజమానిని పలకరించినా చంద్రబాబు పాలన రాష్ట్రానికి అవసరం అంటూ ప్రజలు తెలుపుతున్నారన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా చంద్రబాబును గెలిపించుకుని సీఎం చేస్తామని ప్రజలు అంటున్నారన్నారు. మినీ మేనిపెస్టోలో చంద్రబాబు ఇచ్చిన హామీలకు ప్రజలు ఆకర్శితులవుతున్నారన్నారు. ఎక్కడ సభలు నిర్వహించినా తండోపతండాలుగా జనాలు తరలి వస్తున్నారన్నారు. కడప జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు, ఇమ్రాన్, శివ, ఇలియాస్, శంకర్‌యాదవ్, వెంకటేశ్, ఈశ్వరయ్య, జింక శ్రీను, మురళీమోహన్, అయ్యవారయ్య, రాజు, మహిళా నాయకురాలు స్వర్ణలత, నిర్మల, మీనాక్షి, విజయలక్ష్మి, దేవి, మల్లీశ్వరి, లావణ్య, అమరావతి, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



ప్రజలకు అభివాదం చేస్తున్న అమీర్‌బాబు, లక్ష్మీరెడ్డి తదితరులు

‘టీడీపీ అధికారంలోకి వస్తే రైతుకు ఏడాదికి రూ.20వేలు’

పెండ్లిమర్రి, జనవరి 27: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే రైతు శ్రేయస్సుకై ఏడాదికి రూ.20వేలు రైతు నిధికింద ఇస్తారని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. శనివారం మం డలంలోని కొత్త గంగిరెడ్డిపల్లెలో కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి ఆదేశాల మేరకు బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లికి వందనం పేరుతో రాష్ట్రంలోని మహిళలందరూ ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం, దీపం పథకంలో ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తారన్నారు. వీటితో పాటు మహిళలకు అనేక పథకాలు ప్రవేశపెట్టారని ప్రజలకు వివరించారు. టీడీపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల క్లస్టర్ ఇన్‌చార్జి కిషోర్‌రెడ్డి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి రామాంజనేయులు,శ్రీనాథ్‌రెడ్డి, బ్రహ్మం, ఆంజనేయులు, గణపతి, సుబ్బరామిరెడ్డి, నాగసుబ్బయ్య, మైసూరారెడ్డి, గ్రామ ప్రజలు, టీడీపీనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గ్రామస్థులతో మాట్లాడుతున్న టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కిషోర్‌రెడ్డి

‘సైకో పోవాలి.. సైకిల్ రావాలి’

సీకేదిన్నె, జనవరి 27: రాష్ట్రంలో సైకో పాలన పోయి సైకిల్ పాలన రావాలని యువనేత పుత్తా చైతన్యరెడ్డి తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం కార్పొరేషన్‌లో విలీనమైన వెంకటగారిపల్లె, పోలుగారిపల్లె, అగ్రహారం, సాయిప్రతాప్‌నగర్, జేపీనగర్, తదితర ప్రాంతాల్లో శనివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి, సంక్షేమం రంగాల్లో ముందుండాలంటే సైకిల్ గుర్తుకు ఓటు వేసి తెలుగుదేశం జనసేన పార్టీలను అధికారంలోకి తీసుకురావాలన్నారు. తద్వారా ప్రజలు అన్నివిధాలా అభివృద్ధి చెందుతారన్నారు. చంద్రబాబు మహిళల కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టడం జరిగిందని, అవి అమలు చేసే సత్తా చంద్రబాబుకే ఉందని మినీ మేనిఫెస్టోలో సూపర్ 6 పథకాలకే ప్రజల్లో ఆదరణ పెరుగుతోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కృష్ణారెడ్డి, మోహన్‌బాబు, శివశంకర్, నరసింహులు, మునీంద్ర, బాష, తదితరులు పాల్గొన్నారు.



బాబు ష్యూరిటీ కార్యక్రమంలో పుత్తా చైతన్యరెడ్డి

ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యం: తులసిరెడ్డి

వేంపల్లె, జనవరి 27: ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యమని కాంగ్రెస్ రాష్ట్ర మీడియా చైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. శనివారం వేంపల్లెలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ హోదా ముగిసిన అధ్యాయం అని చెప్పి బీజేపీ రాష్ట్రానికి ద్రోహం చేసిందన్నారు. ప్రాంతీయ పార్టీలైన వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీలకు ప్రత్యేక హోదా ఇచ్చే శక్తి, తెచ్చే శక్తి లేదన్నారు. బీజేపీ చేతిలో ఈ పార్టీలు కీలుబొమ్మలన్నారు. ప్రస్తుతం దేశంలోని పది రాష్ట్రాలలో ప్రత్యేక హోదా అమలులో ఉంది, దీని వలన అనేక ప్రయోజనాలున్నాయన్నారు. ఉపాధి హామీపథకం లాంటి కేంద్ర ప్రాయోజిత పథకాలకు 90శాతం నిధులు కేంద్రం భరిస్తుందన్నారు.

టీడీపీ అధికారంలోకి రాగానే బీసీ రక్షణ చట్టం అమలు

కడప (ఎడ్యుకేషన్), జనవరి 27 :టీడీపీ అధికారంలోకి రాగానే బీసీ రక్షణ చట్టం అమలు చేస్తామని ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో బీసీ ఓట్లతో గద్దెనెక్కిన జగన్‌మోహన్‌రెడ్డి బీసీలను మోసం చేశారని, రాష్ట్ర వ్యాప్తంగా 300 మంది బీసీలను హత్య చేశారని ఆరోపించారు. శనివారం కడప నగరం నాలుగో డివిజన్ ఆర్‌కే నగర్‌లో టీడీపీ బెస్తసాధికార సమితి రాష్ట్ర కన్వీనరు యాటగిరి రాంప్రసాద్ అధ్యక్షతన జయహో బీసీ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలను అణగతొక్కే ప్రభుత్వం వైసీపీనే అన్నారు. 300మంది బీసీలు హత్యకు గురయ్యారన్నారు. బీసీ వ్యతిరేక పాలన రాష్ట్రంలో కొనసాగుతోందని బీసీ కులాలు గుర్తెరగాలన్నారు. రాజకీయంగా బీసీలను ఎదగనీయకుండా స్థానిక సంస్థల రిజర్వేషన్లలో 34 నుంచి 24 శాతానికి తగ్గించారన్నారు. దుర్మార్గపాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వానికి నూకలు చెల్లిస్తారని హెచ్చరించారు. ఒక్కసారి అవకాశం ఇవ్వమని అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని అన్నివిధాలా భ్రష్టు పట్టించారన్నారు. కార్యక్రమానికి పలువురుబీసీ సంఘం నాయకులు కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

‘సివిల్ సప్లై అధికారులపై చర్యలు తీసుకోవాలి’



సమావేశంలో మాట్లాడుతున్న బాదుల్లా

కడప (సెవె న్‌రోడ్స్), జనవరి 27: పౌరసరఫరాల శాఖ ద్వారా అందించే బియ్యం, కందిబేడలు, చక్కెర, గోధుమపిండి లబ్ధిదారులకు అందించకుండా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న సివిల్ సప్లై అధికారులపై చర్యలు తీసుకోవాలని, అలాగే సంవత్సరాల తరబడి కొనసాగుతున్న సివిల్ సప్లై డీఎం అర్జున్ రావును విధుల నుంచి తప్పించాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా డిమాండ్ చేశారు. శనివారం స్థానిక హోచిమన్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాదుల్లా మాట్లాడుతూ రైలు వ్యాగన్ నుంచి సివిల్ సప్లై గోడౌన్‌కు చేరిన సరుకులను డీలర్లతో మిలాఖత్ అయి సరఫరా చేయకుండానే సరఫరా చేసినట్లు చూపించి బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలించి లక్షల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. గత రెండు సంవత్సరాల క్రితం సివిల్ సప్లై గోడౌన్స్‌లో ఉన్న మిగులు బియ్యాన్ని అన్నమయ్య జిల్లాకు లోడింగ్ చేసిన డబ్బులను హమాలీలకు ఇంతవరకు సివిల్ సప్లై అధికారులు చెల్లించకుండా కాలయాపన ఎందుకు చేస్తున్నారో అర్థం కావడంలేదన్నారు. తక్షణం డీఎం కార్యాలయంలోని రికార్డులను విజిలెన్స్ అధికారులు తనిఖీ చేసి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

‘అభివృద్ధికి సోపానాలు రహదారులే’



రోడ్డును ప్రారంభిస్తున్న ఆర్‌అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న

చెన్నూరు, జనవరి 27 : ఏ రహదారి బాగున్నా ఆ ప్రాంతం ప్రజలు అభివృద్ధి పథంలో ఉంటారనేందుకు నిదర్శనమని, అందుకే రహదారులు అభివృద్ధికి సోపానాలని ఆర్‌అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న అన్నారు. మండలంలోని ఉప్పరపల్లె వద్ద హైవే రహదారి నుంచి పుష్పగిరి వరకు రూ.9.5కోట్లతో ఏర్పాటు చేసిన డబుల్ రోడ్డును శనివారం ఆయన కలెక్టరు విజయరామరాజుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుష్పగిరి పుణ్యక్షేత్రానికి గతంలో సింగిల్‌రోడ్డు ఉండేదని, ఇప్పుడు డబుల్ రోడ్డు వేయడంతో ప్రజలకు ఎంతో సౌకర్యంగా మారిందన్నారు. ఈ రోడ్డు వల్ల పుష్పగిరి పర్యాటన కేంద్రం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. అనంతరం ఉప్పరపల్లె ప్రాంతంలో రూ.80లక్షలతో నిర్మించిన గోడౌన్‌ను అటవీశాఖ పీసీసీఎఫ్ ఎరసాని మధుసూదన్‌రెడ్డి ప్రారంభించారు. అలాగే శివాలపల్లె, ఉప్పరపల్లె సమీంలో ఉప్పువంకపై నిర్మించిన బ్రిడ్జిలను కూడా అధికారులు ప్రారంభించారు. ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి, జేసీ గణేష్‌కుమార్, ఆర్డీఓ మధుసూదన్, డీఎఫ్ఓ సుధీర్, తహసీల్దారు ఆలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీపై సీఎం చొరవ చూపాలి: సీపీఎం



ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేసినట్లు తెలిపే బ్యానర్ వద్ద సీపీఎం నేతలు

కడప (సెవె న్‌రోడ్స్), జనవరి 27 : రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రైవేటు ఆసుపత్రుల్లో నిలిచిపోయిన ఆరోగ్యశ్రీ సేవలను తిరిగి కొనసాగించేలా సీఎం చొరవ చూపాలని సీపీఎం కడప నగర కార్యదర్శి ఎ.రామ్మోహన్, జిల్లా కమిటీ సభ్యు డు దస్తగిరిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం నగరంలో వివిధ ప్రైవేటు ఆసుత్రుల వద్ద ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేస్తున్నట్లు ప్రదర్శించిన ఫ్లెక్సీలను వారు సందర్శించారు. అ నంతరం మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు బిల్లులు చెల్లించకపోవడం, గత జూన్ 23 నుంచి నిలిచిపోయిన బకాయిలు సుమారు వెయ్యి కోట్లకు చేరడం తదితర కారణాల వల్ల ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నాయన్నారు. బకాయిలను తక్షణమే చెల్లించి పేద ప్రజలకు ఆరోగ్యశ్రీని అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందన్నారు.

గ్రామ పంచాయతీలో ప్రతి సమస్యనూ పరిష్కరిస్తాం

● ఈఓఆర్‌డీ సురేష్‌బాబు

చెన్నూరు, జనవరి 27 : చెన్నూరు మేజరు గ్రామ పంచాయతీలో నెలకొన్న ప్రతి సమస్యనూ పరిష్కరిస్తామని ఈఓఆర్‌డీ సురేష్‌బాబు అన్నారు. చెన్నూరు గ్రామ పంచాయతీ ఆవరణంలో సర్పంచ్ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవోఆర్‌డీ మాట్లాడుతూ ప్రతి గ్రామ సభలో ప్రజలు చెప్పిన సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఇప్పుడు కూడా సమస్యలపై ఎవరు అర్జీలు ఇచ్చినా పరిశీలించి తక్షణం పరిష్కరిస్తామన్నారు. అనంతరం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జీఎస్ భాస్కర్‌రెడ్డి హిందూ శ్మశాన వాటిక వద్ద సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని, డంపింగ్ యార్డు ఉండడం వల్ల ఊరిలో ఏ జంతువులు చనిపోయినా కళేబరాలు తీసుకువచ్చి వేస్తున్నారని, వాటిని అక్కడ వేయకుండా చూడాలని గ్రామసభ దృష్టికి తీసుకొచ్చారు. అలాగే స్త్రీశక్తి భవనం పక్కన దారి ఆక్రమించారని, అక్కడ దారి సమస్య తీర్చాలన్నారు. అలాగే నాగులకట్ట వీధిలో రోడ్డుపై నిత్యం నీరు నిలిచ రాకపోకలకు ఇబ్బంది ఉందని, అక్కడ డ్రైనేజీ ఏర్పాటు చేయాలన్నారు. భవానీనగర్‌లో పెండింగులో ఉన్న సిమెంటు రోడ్డు వేయాలని, ఆయాప్రాంతాలప్రజలు ఇచ్చిన సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి రామసుబ్బారెడ్డి, ఏపీయం గంగాధర్, ప్రజలు పాల్గొన్నారు.

‘యుద్ధభేరి మహాసభను దిగ్విజయం చేయండి’

కడప (మారుతీనగర్), జనవరి 27: విజయవాడ (గాంధీనగర్) జింఖానా గ్రౌండ్‌లో ఈనెల 31న తలపెట్టిన మాదిగ, రెల్లి, డక్కలి ఉపకులాల యుద్ధభేరి మహాసభకు జిల్లాలోని మాదిగల పెద్దఎత్తున తరలిరావాలని ఏపీ ఎమ్మార్పీఎస్ (పేరుపోగు వర్గం) జిల్లా అధ్యక్షుడు తప్పెట శివకుమార్ పిలుపునిచ్చారు. ఆ మేరకు శనివారం కడపలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తొలుత మహాసభ కరపత్రాలను ఆవిష్కరించి తదుపరి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణతోనే మాదిగ జాతి అభివృద్ధి దిశగా అడుగులు వేస్తుందనే విశ్వాసంతో ఉన్నామన్నారు. ఎస్సీ వర్గీకరణ విషయమై గతంలో కేంద్ర ప్రభుత్వానికి ఇచ్చిన కమిషన్ రిపోర్ట్‌ల ఆధారంగా ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆ మేరకు చట్టబద్ధత కల్పించాలన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి నేటి వరకు అన్ని రంగాలలో మాదిగలు ఇతర కులాల కన్నా వెనుకబడి ఉన్నా పాలకుల్లో స్పందన లేదన్నారు. ముఖ్యంగా రాజకీయ రంగంలో మరింత అన్యాయానికి గురౌతున్నామన్నారు. కావున రానున్న ఎన్నికల్లో అయినా చట్టసభల్లో మాదిగలకు సమన్యాయం జరిగేలా అన్ని పార్టీలు మాదిగ, మాదిగ ఉపకులాలకు 21 అసెంబ్లీ, 4 పార్లమెంట్ సీట్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఎస్సీ వర్గీకరణకు అన్ని పార్టీలు సుముఖత వ్యక్తం చేస్తున్నా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మాత్రం మౌనం వహిస్తుండటం బాధాకరమన్నారు. మాదిగల ఓట్లతో గద్దెనెక్కిన వైసీపీ ప్రభుత్వం గత నాలుగున్నర సంవత్సరాలుగా నిమ్మకు నీరెత్తినట్లు పాలన సాగిస్తోందని విమర్శించారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి తప్పెట హరిబాబు, కార్యదర్శి గొడుగునూరు మునెయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న సీఐ సురేష్‌రెడ్డి

పులివెందుల టౌన్, జనవరి 27: ప్రతి ఒక్కరు నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ సీఐ సురేష్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు డ్రైవింగ్ లైసెన్స్, సరైన రికార్డులు కలిగి ఉండాలని సూచించారు. బైకు మరియు కారు నడిపే సమయంలో తప్పకుండా హెల్మెట్, సీట్‌బెల్టు ధరించి, ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు.

కేఏటి ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రభంజనం



కేఏటీ ఫలితాల్లో విజయకేతనం ఎగురవేసిన విద్యార్థులు

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 27 : క్యాట్ లెవల్2 పరీక్షల్లో కడప నగరం కోఆపరేటివ్ కాలనీలోని శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని విద్యాసంస్థల ఏజీఎం రమణయ్య తెలిపారు. కడప జోన్ పరిధిలోని క్యాష్‌ప్రైజ్ వి న్నర్స్‌గా ఆరుగురు విద్యార్థులు రూ.1000 సొంతం చేసుకున్నారన్నారు. వీక్షితారెడ్డి, ఎం ఎన్ తమీమ్, ఎంఎస్ అమీర్, జీతేష్, ఎస్, ఎరికా, జోనతాన్, ఎస్.దేవేంద్ర రూ.1000 సొంతం చేసుకున్నారన్నారు. వారితో పాటు 66 మంది విద్యార్థులకు మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్లు పొందారన్నారు. విజయానికి కారణమైన ఉపాధ్యాయ బృందం, విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాల్ ఎ.షర్మిల, ఇన్‌చార్జ్ బురానుద్దీన్, ఐకాన్ ఇన్‌చార్జ్ శ్రావణి, డీన్ మల్లికార్జున, టీచర్లు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే యువత భవిష్యత్తు

బాబు ష్యూరిటీ భవిష్యత్తుగ్యారెంటీ కార్యక్రమంలో టీడీపీ నేతలు

ప్రొద్దుటూరు ,జనవరి 27 : జగన్ను మళ్ళీ గెలిపిస్తే ప్రజల ఆస్తులను దోచుకుంటాడని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఈశ్వరరెడ్డి నగర్‌లో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యాక్రమం చేపట్టారు. టీడీపీ నాయకుడు నంద్యాల కొండారెడ్డి, నాగ మునిరెడ్డి, ఘంటశాల వెంకటేశ్వర్లు,వంగల నారాయణరెడ్డి , మాజీ సర్పంచ్ సాంబశివుడు, మాజీ ఎంపీటీసీ షామీర్, లావణ్య, గంగాధర్, చక్రధర్, అమ్మణ్ణమ్మ స్టోర్‌తులశమ్మ, పల్లేటి రాముడు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు..: చంద్రబాబుతోనే రాష్ట్రంలో నిరుద్యోగ యువత భవిష్యత్తు ముందుకు వెళుతుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌రెడ్డి సతీమణి మౌనికారెడ్డి పేర్కొన్నారు. శనివారం శ్రీనివాసనగర్‌లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు ఇన్‌చార్జ్‌లు సుర సుర శ్రీనివాసులు, మధు,పుల్లయ్య,మాజీ కౌన్సిలర్ సాలయ్య, కరిముల్లా, బీసీ సెల్ కార్యదర్శి తాటి శ్రీను, జిల్లా అధికార ప్రతినిధి ఆవుల దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలోని ఆరు పథకాలను ప్రజలకు వివరిస్తూ బద్వేలు టీడీపీ ఇన్‌ఛార్జ్ బొజ్జ రోశన్న ప్రచారం చేశారు. శనివారం ఆయన పోరుమామిళ్లలోని 14వ వార్డు, 13వ వార్డు, ఓల్డ్ పోస్టాఫీసు వీధుల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యనమల సుధాకర్, రామసుబ్బారావు, సీతా వెంకటసుబ్బయ్య, ఇమాం హుసేన్, సెట్టెం ప్రతాప్, వెంకటేశ్వర్లు, అతికారి రాజా, నెంబరువలి కుమారుడు మస్తాన్, అన్వర్, సత్యరాజ్, గిరి, అన్వర్, దానం పాల్గొన్నారు.

కలసపాడు..: మండలంలోని బలిజపల్లె గ్రామంలో శనివారంబద్వేలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బొజ్జ రోశన్న బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ పత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. టీడీపీకి ఓట్లు వేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ఉపాధ్యక్షుడు పట్టాభిరెడ్డి, ప్రధాన కార్యదర్శి భద్రయ్య, నాయకులు నారాయణరెడ్డి, యువ నాయకులు రామచంద్రారెడ్డి, రామిరెడ్డి, శ్రీనాధరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముద్దనూరు..: రాష్ట్రం అభివృద్ధిబాట పట్టాలంటే సీఎంగా చంద్రబాబును చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధి ఉప్పలూరు, చిన్నకత్తెరపల్లె, ఆకుతోటపల్లె గ్రామాల్లో శనివారం బాబుష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో నిర్వహించారు. అందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి మినీమేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎల్.నాగిరెడ్డి, వెంకట్రామిరెడ్డి, లక్ష్మీనరసయ్య, శివారెడ్డి, పెద్దమాబు, గంగిరెడ్డి, పోలిరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, గాలి రమణారెడ్డి, రవి,రామకృష్ణయ్య, బట్టు రమణయ్య, ఆంజనేయులు, ఓబులేసు,రోషిన్ టీడీపీ, జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖాజీపేట..: ఎప్పుడు ఎన్నికలు వచ్చినా తెలుగుదేశానికే ఓటు వేస్తామని ప్రజలు ముక్తకంఠంతో చెబుతున్నారని ఖాజీపేట క్లస్టర్ ఇన్‌చార్జి వీరయ్య అన్నారు. శనివారం ఖాజీపేటలో ఎనిమిది బూత్ ఇన్‌చార్జిలు బాబు ష్యూరిటీ, భవిష్యత్తు గ్యారెంటీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిద్దారం కదిరుల్లా, జలీల్, హబీబ్, జాఫర్, తదితరులు పాల్గొన్నారు.




ప్రొద్దుటూరు, ముద్దనూరులో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, భూపేశ్‌రెడ్డి





ప్రొద్దుటూరు, పోరుమామిళ్లలో ప్రచారం నిర్వహిస్తున్న మౌనికారెడ్డి, బొజ్జా రోశన్న, ఖాజీపేటలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు



టీడీపీ కండువాలు వేస్తున్న పుట్టా సుధాకర్‌యాదవ్, సురేశ్‌నాయుడు

దువ్వూరు (మైదుకూరు), జనవరి 27 : గత ఎన్నికల్లో టీడీపీ నుంచి వైసీపీలో చేరిన నాయకులు శనివారం తిరిగి సొంతగూటికి చేరారు. దువ్వూరు మండలం రామాపురానికి చెందిన గుర్రం రఘునాథనాయుడు వారి అనుచర వర్గ కుటుంబాలతో సహా శనివారం సాయంత్రం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుట్టా సుధాకర్‌యాదవ్, సీఎం సురేష్ నాయుడు సమక్షంలో దాదాపు 50 కుటుంబాల వారు టీడీపీ చేరారు. ఈ సందర్భంగా పుట్టా, సురేష్ నాయుడులు మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్ చంద్రబాబునాయుడు చేతుల్లోనే ఉందని ఈ కార్యక్రమంలో కొల్లు రఘునాథనాయుడు, గుది సురేష్, కొల్లు సుధాకర్ , నాయకుల బోరెడ్డి వెంకట రమణారెడ్డి, పుట్టా ప్రభాకర్‌యాదవ్, బాబు, జనసేన నాయకులు మల్హోత్ర పాల్గొన్నారు.

200 కుటుంబాలు టీడీపీలో చేరిక



మైదుకూరులో టీడీపీలోకి చేరుతున్న లారీ యూనియన్ యజమానులు, వర్కర్లు

మైదుకూరు, జనవరి 27 : వచ్చే ఎన్నికల్లో టీడీపీని ఆదరించాలని ఆ పార్టీ ఇన్‌చార్జ్ పుట్టా సుధాకర్‌యాదవ్ పేర్కొన్నారు. గ్రంధాలయ సంస్థ జిల్లా మాజీ డైరెక్టర్ ఏపీ రవీంద్ర ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని మిని లారీ అసోసియేషన్‌కు చెందిన వెంకటపతికి సంబంధించిన దాదాపు 200 కుటుంబాల వారిని టీడీపీలోకి ఆయన కండువాలు కప్పి చేర్చుకున్నారు. ఈ సందర్భంగా ఓ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో డీకేటీ భూములను చాలా ప్రాంతాల్లో వైసీపీ నాయకులు ఆక్రమించుకున్నారని, వాటిని తిరిగి స్వాధీనం చసుకొని అర్హులైన పేదలకు పంపిణీ చేస్తామని తెలిపారు. ప్రొద్దుటూరు టీడీపీ నాయకులు వరదరాజులరెడ్డి మాట్లాడుతూ జగన్ పాలనలో ప్రజా వ్యతిరేక విధానాలే నిరంకుశంగా అమలు చేశారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దాసరి బాబు, ధనపాల జగన్, ఆకుల క్రిష్ణయ్య, బీపీ సుధాకర్‌రెడ్డి, బీయన్ శ్రీనివాసులు, జనసేన నాయకులు మల్హోత్ర, క్రిష్ణమూర్తి పాల్గొన్నారు.

రామాపురంలో ఇంటింటి ప్రచారం

దువ్వూరు (మైదుకూరు), జనవరి 27 : రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుట్టా సుధాకర్‌యాదవ్ శనివారం సాయంత్రం దువ్వూరు మండలం రామాపురంలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఆయన స్థానిక నాయకులతో కలసి రామాపురం ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకలు బోరెడ్డి వెంకటరమణారెడ్డి, సంజీవరెడ్డి, పుట్టా ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

'గ్రామాల్లో తీవ్ర సమస్యల వెల్లువ'



మాట్లాడుతున్న పాలకొండ సుధా

అట్లూరు, జనవరి 27 :మండలంలోని ప్రజలు వైసీపీ ప్రభుత్వంలో తీవ్ర ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నారని కడప టీడీపీ పార్లమెంటరీ మహిళా అధ్యక్షురాలు పాలకొండ సుధా విలేకరుల సమావేశంలో శనివారం టీడీపీ కార్యాలయం నందు వెల్లడించారు. ఇంత వరకు జరిగిన బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ టీడీపీ ప్రవేశపెట్టిన పథకాల మేనిఫెస్టోను వివరిస్తూ ప్రజల వద్దకు వెళ్లడంతో వారు తీవ్ర సమస్యలు వెల్లడించడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా అట్లూరు మండల టీడీపీ అధ్యక్షుడు పి.మల్లికార్జునరెడ్డి, ఎస్.వెంకటాపురం, అక్కిరెడ్డిగారిపల్లె గ్రామస్తులు వైసీసీ నాయకులు నారా ఎల్లయ్య, ఎర్రబెల్లి గంగులయ్యతో పాటు పలువురిని కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మండల పరిశీలకులు శివయ్యస్వామి, రామిరెడ్డి, మండల ఉపాధ్యక్షులు అమర్‌నాథరెడ్డి, రామచంద్రరెడ్డి, ఎం.మహేశ్వర్‌రెడ్డి, పి.రాధాక్రిష్ణారెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రిషికేశవ, టీడీపీ కార్యకర్తలు ఉన్నారు.

మౌలిక వసతులేవీ..?

ప్రొద్దుటూరు , జనవరి 27 : వైసీపీ ప్రభుత్వం వచ్చి ఐదేళ్ళు గడిచినా అమృతనగర్‌లో పేదలకు ఇచ్చిన ఇంటి స్థలాల్లో కనీసం రోడ్లు, విద్యుత్, నీటి సదుపాయం కల్పించలేదని సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు శనివారం స్థానిక తహసీల్దారుకార్యాలయం ఆవరణలో రిలే దీక్షలు రెండో రోజుకు చేరుకున్నాయి. కార్యక్రమంలో రాముడు,మధుసూధన్‌రెడ్డి, బాబు ,శారద, రాములమ్మ, రఫీ, ఫాతిమా భాను పాల్గొన్నారు.

42 మద్యం బాటిళ్లు స్వాధీనం

రాజుపాలెం, జనవరి 27 :మండల పరిధిలోని వెలవలి గ్రామానికి చెందిన కమ్ముసాబ్‌గారి మహబూబ్‌బాషా అనే వ్యక్తి వద్ద 42 అక్రమ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నాగప్రసాద్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు యోగా ధ్యాన శిబిరం

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 27 : యోగా ధ్యాన ప్రాముఖ్యతను తెలియజేయడానికి ఆదివారం తొగటవీరక్షత్రియ కల్యాణ మండపంలో యోగాధ్యాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఓంశా మండలి శివశక్తి అవతార్ సేవా సంస్థ ప్రచారక్ ఎం.తిరుపతి తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు యోగా ధ్యాన శిబిరం ఉంటుందని తెలిపారు. సమావేశంలో కార్యక్రమ కోఆర్డినేటర్ అవ్వారు సుబ్బారావు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ బీసీ ఉద్యోగుల రాష్ట్ర మహాసభలు

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 27 : ఏపీ విద్యుత్ బీసీ ఉద్యోగుల రాష్ట్ర మహాసభలు ఈనెల 29న ఉదయం 10 గంటలకు కడప జెడ్పీ హాల్‌లో నిర్వహించనున్నట్లు సంఘం డిస్కం అధ్యక్షుడు మురళీమోహన్ తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఈ మహాసభలో కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయడం, పీఆర్సీలపై జరిగిన అన్యాయాలపై ఈ సభలో చర్చిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య యాదవ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బీఎన్ మూర్తి, లక్ష్మీనారాయణ, నాగరాజు, అంజనేయరాజు, రఘు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు

తప్పిన ప్రమాదం

పోరుమామిళ్ల, జనవరి 27 : పోరుమామిళ్ల మండలంలోని నాగల కుంట్ల సమీపంలో శ్రీశైలం నుంచి పోరుమామిళ్లకు వస్తున్న ఆర్టీసీ బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కకు వాలిపోయింది. శనివారం శ్రీశైలం నుంచి పోరుమామిళ్లకు వస్తున్న ఈ బస్సు ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి పక్కకు వాలింది. ఈ సంఘటనలో ప్రయాణికులు స్వల్పగాయాలతో బయటపడ్డారు.

డ్వాక్రా మహిళల అభివృద్ధే లక్ష్యం

బ్రహ్మంగారిమఠం, జనవరి 27 : రాష్ట్రంలోని డ్వాక్రా సంఘం మహిళల అభివృద్ధే ముఖ్యమంత్రి లక్ష్యమని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి తెలిపారు. శనివారం బి.మఠం మండలకేంద్రంలోని యోగివేమన రెడ్ల కళ్యాణ మండపంలో వైఎస్ఆర్ ఆసరా నాలుగో విడత సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వీరనారాయణరెడ్డి, జడ్పీటీసీ ముత్యాల రామగోవిందురెడ్డి డీఆర్‌డీఏ పీడీ ఆనందనాయక్, ఎంపీడీవో వెంగమునిరెడ్డి, స్థానిక అధికారులు వైసీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరించాలి

బ్రహ్మంగారిమఠం, జనవరి 27 : మండలంలో భూ సమస్యలు అధికంగా ఉన్నాయని, పరిష్కరించేందుకు రెవెన్యూశాఖ అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అన్నారు. శనివారం బి.మఠం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వీరనారాయణరెడ్డి, జడ్పీటీసీ ముత్యాల రామగోవిందరెడ్డి, ఎంపీడీవో వెంగమునిరెడ్డి, సహకార సంఘం చైర్మన్ నేలటూరు సుబ్బారెడ్డి, మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతోనే ఆరోగ్యం, ఆర్థికాభివృద్ధి

మైదుకూరు రూరల్, జనవరి 27 : చిరుదాన్యాలతో మనుషులకు ఆరోగ్యంతో పాటు రైతుల ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని కృషి విజ్ఞాన కేంద్రం విస్తరణ సంచాలకులు కరుణశ్రీ పేర్కొన్నారు. మండలంలోని వనిపెంటలో శనివారం చిరుధాన్యాల మేళ నిర్వహించారు. అనంతరం చిరుధాన్యాల సాగుపై పుస్తకావిష్కరణ చేపట్టారు. కాగా చిరుధాన్యాలతో వేసిన ముగ్గు పలువురిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు విజయవిహారి, మైఖేల్ రాజీవ్, రామక్రిష్ణ, ఏవోలు లక్ష్మీ ప్రసన్న, ప్రవీణ్, బీజేపీ నాయకులు బీపీ ప్రతాప్, రాజమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవాలి

కొండాపురం, జనవరి 27 :రబీ సీజన్‌లో రైతులు రైతుభరోసా కేంద్రంలో ఈ-పంటలో నమోదు చేయించుకోవాలని ఏవో రామాంజులరెడ్డి తెలిపారు. శనివారం కొండాపురం రైతు భరోసా కేంద్రంలో మండలంలోని ఆర్బీకే ఇన్‌చార్జ్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ-పంటలో నమోదు చేయించుకున్న తర్వాత ఈ-కేవైసీ చేయంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

కోదండరామస్వామి దేవాలయ చైర్మన్‌గా చాపాటి లక్ష్మీనారాయణరెడ్డి

పోరుమామిళ్ల, జనవరి 27 : మండలంలోని రెడ్డినగర్‌లోని కోదండ రామస్వామి దేవాలయ నూతన చైర్మన్‌గా చాపాటి లక్ష్మీనారాయణ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం ఆలయ సభ్యులు అందరూ కలిసి చైర్మన్‌ను ఎన్నుకున్నారు. అలాగే కార్యవర్గసభ్యులను కొందరిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి పూజలు

బద్వేలు రూరల్, జనవరి 27 : వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మి నరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామునే అభిషేకం, ఆపై ప్రత్యేకపూజలు చేయడంతో ప్రజలు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ చేశారు.

బీసీలకు వెన్ను దన్నుగా ఉండేది టీడీపీనే : ప్రవీణ్‌రెడ్డి



ప్రొద్దుటూరు , జనవరి 27 : బీసీలకు అన్ని విధాల వెన్నుదన్నుగా వుండేది టీడీపీనే అని ఇన్‌చార్జ్ ప్రవీణ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పద్మశాలీయ కల్యాణ మండపంలో జయహో బీసీ సభను టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రొద్దుటూరులో ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి బీసీలకు అన్యాయం చేయడం తప్ప బీసీలను అభివృద్ధి చేసింది లేదన్నారు. వైసీపీ అన్యాయాలను ప్రశ్నించినందుకు బీసీనాయకుడు నందం సుబ్బయ్యను కిరాతకంగా నరికివేశారన్నారు. పేరుకే బీసీ మహిళా చైర్‌పర్సన్ మాత్రం వుందని పాలన అంత ఎమ్మెల్యే ఆయన బావమరిది చేతుల్లో వుందన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పాణ్యం సావిత్రమ్మ, మాజీ కౌన్సిలర్లు పాణ్యం సుబ్బరాయుడు, తాటి శ్రీను ,ఆవుల దస్తగిరి , సుంకరవేణు గంగాధర్ క్రిష్ణయ్య యాదవ్, పల్లా లక్ష్మీదేవి, ఇట్టే లక్ష్మీదేవి, సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాను నిశితంగా పరిశీలించండి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ శివనాథరెడ్డి

జమ్మలమడుగు, జనవరి 27: జమ్మలమడుగు నియోజకవర్గంలోని ఓటర్ల జాబితా ఆయా ప్రాంతాలకు చెందిన క్లస్టర్, యూనిట్, బూత్ కన్వీనర్లు నిశితంగా పరిశీలించి తప్పులుంటే వెంటనే ఫిర్యాదు చేయాలని మాజీ ఎమ్మెల్సీ దేవగుడి శివనాథరెడ్డి, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి నేట్లపల్లి శివరాం సూచించారు. శనివారం జమ్మలమడుగు టీడీపీ కార్యాలయం ఆవరణలో జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం మండలాల క్లస్టర్, యూనిట్, బూత్ కన్వీనర్లకు ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు ఫకృద్దీన్, సుమంత్, టీడీపీ నాయకులు పొన్నతోట శ్రీను, శంకర్, కిరణ్‌రాయల్, ఐఎల్ చిన్న, దాదాపీర్, మురళి, జింకల బాష, తదితరులు పాల్గొన్నారు.

పలువురు టీడీపీలో చేరిక..: జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో శనివారం పలువురు టీడీపీ కండువా కప్పుకున్నారు. పెద్దముడియం మండలం నెమళ్లదిన్నె గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ పోరెడ్డి విఘ్నేశ్వరరెడ్డి, యనమల శివారెడ్డి, గరిశలూరు గ్రామానికి చెందిన ఈదుల పక్కీరారెడ్డికి మాజీ ఎమ్మెల్సీ శివనాథరెడ్డి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పెద్దముడియం మండల టీడీపీ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, రామలింగారెడ్డి, పురుషోత్తంరెడ్డి, నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇంటిస్థలాలు ఇవ్వాలి

బద్వేలు రూరల్, జనవరి 27 : పట్టణంలోని పూసలవాడ కాలనీలో బాడుగ ఇళ్లల్లో నివాసం ఉంటున్న అర్హులైన పేదలకు ప్రభుత్వం ఇంటిస్థలాలు మంజూరు చేయాలని సీపీయం పట్టణ కార్యాదర్శి శ్రీను ప్రభుత్వాన్ని కోరారు. శనివారం సుందరయ్యభవన్‌లో బాడుగ ఇళ్లల్లో నివాసం ఉంటున్న వారితో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముడియం చిన్ని, ఆంజనేయులు, బాలగురవయ్య, సుల్తానా, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్



సుబ్బరామిరెడ్డి

జమ్మలమడుగు, జనవరి 27: జమ్మలమడుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్ష శాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్న పోకల సుబ్బరామిరెడ్డి డాక్టరేట్ అందుకున్నారు. శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తోటి అధ్యాపకులు, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి అభినందనలు తెలియజేశారు. సుబ్బరామిరెడ్డి వృక్ష శాస్త్రంలో పరిశోధన చేసి గ్లోకల్ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకున్నట్లు తెలిపారు. ప్రొఫెసర్ డాక్టర్ క్రిషన్‌పాల్ పర్యవేక్షణలో వృక్ష శాస్త్రంలో టాక్సనమిక్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ అర్బస్క్యులర్ మైక్రోరైజల్ ఫంగయై కలనిజింగ్ ఫ్లెమింగ్‌జియా ఎస్టిటాబెంత్ ఎక్స్‌బేకర్ రూట్స్ పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు.

కాలువల లెవల్స్ పరిశీలన

ప్రొద్దుటూరు, జనవరి 27 : ప్రొద్దుటూరు పట్టణంలోని ప్రధాన కాలువ అయిన కొత్తపల్లె ఛానల్ ఆధునికీకరణతో పాటు 75 కిలో మీటర్ల అంతర్గత కాలువల నిర్మాణానికి 163 కోట్లతో టెండర్లు పూర్తయ్యాయి. డిజైన్స్ అప్రూవల్ పూర్తికాక పనులు ప్రారంభం కాలేదు. ఇందుకోసం అనంతపురం పబ్లిక్ హెల్త్‌సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీనాధరెడ్డి శనివారం ప్రొద్దుటూరుకు వచ్చారు. ఈఈ చెన్న కేశవరెడ్డి, డీఈ యశోదలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కాలువల లెవల్స్‌ను పరిశీలించారు.కాంట్రాక్టర్ తీసిన డిజైన్స్ సక్రమంగా లేకపోవడంపై ఎస్ఈ శ్రీనాధ్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. తిరిగి డిజైన్స్ మార్చుకుని తెస్తే పదిరోజుల్లో అనుమతులు ఇస్తామని తెలియజేశారు.

రాచాయిపేటలో వైద్య శిబిరం

గోపవరం, జనవరి 27 : మండల పరిధిలోని రాచాయిపేటలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం పీహెచ్‌సీ ఎంవో మురళీక్రిష్ణ ఆధ్వర్యంలో జరిగింది. ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యాన్ని అందుబాటులో తేవడం కోసం వైద్యశిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. చరణ్‌కుమార్‌రెడ్డి, సుప్రజ, వినోద్, గౌస్, మల్లేశ్వరమ్మ, శివనాగరాజు, శివ గణేశ్, సర్పంచ్ నాగేంద్ర, పంచాయతీ సెక్రటరీ లిఖిత, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

రంపాడు రోడ్డుకు మోక్షమెప్పుడు...?

- తీవ్రఇబ్బందులు పడుతున్న పంచాయతీ వాసులు



అధ్వానంగా ఉన్న పాపిరెడ్డిపల్లె, ఓబుళాపురం మట్టిరోడ్డు

కాశినాయన జనవరి27: రంపాడు పంచాయతీ ఆవాస గ్రామాలైన ఓబుళాపురం, పాపిరెడ్డిపల్లె గ్రామాల మధ్య సరైన రహదారి సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామపంచాయతీ ఏర్పడి 3 దశాబ్దాలు దాటినా నేటికి సరైన మౌలిక సదుపాయాలు సమకూర లేదు. పంచాయతీలోని రెండు ప్రధాన గ్రామాలైన పాపిరెడ్డిపల్లె,ఓబుళాపురం మధ్య ఉన్న అంతర్గత రోడ్డు మట్టి రోడ్డు కావడం రెండు గ్రామాలమధ్య సగిలేరు అడ్డుగా ఉండటం బ్రిడ్జి సౌకర్యం లేకపోవడం ప్రజలకు శాపంగా మారింది. కంకర, గులకరాళ్లు తేలి గుంతలమయమైన ఈరోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన ముళ్ళ కంప పాదచారుల, వాహన చోదకులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుంది. రంపాడు పంచాయతీ హెడ్ క్వార్టర్ అయిన పాపిరెడ్డిపల్లె గ్రామస్తులు ఓబుళాపురం గ్రామంవద్ద కొత్తగా ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయానికి రావాలంటే ఇబ్బందులు తప్పడంలేదు. పాపిరెడ్డిపల్లె వాసులు కనెకలగుండం మీదుగా సగిలేరు దాటుకొని ఓబుళాపురం పోవాల్సిఉంటుంది. దాదాపు 3 కి.మీ పైగా ఉన్న ఈ దారంతా ముళ్ళ కంప, కంకర తేలి మట్టి రోడ్డుతో అస్తవ్యస్తంగా ఉంది. మామూలు రోజుల్లోనే ఈదారిపై ప్రయాణం కష్టంగా ఉంటుంది. అలాంటిది వర్షం వస్తే ఈదారి మీదుగా ప్రయాణం ఎలా ఉంటుందో చెప్పక్కర్లేదు. ప్రస్తుతం ఏపనిచేయించుకోవాలన్నా గ్రామ సచివాలయానికి వెళ్లాల్సిందని అధికారులు అంటున్నారు.గ్రామ సచివాలయం ప్రారంభోత్సవ సభలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి రంపాడు రోడ్డును త్వరగా బాగుచేయించి ప్రజలకు ఇబ్బందులు రాకుండా తగుచర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించి ఏండ్లు గడుస్తున్నా ఎలాంటి పురోగతి లేదని పంచాయతీ వాసులు వాపోతున్నారు.పంచాయతీలోని 3గ్రామాల ప్రజలకు ఆయకట్టు రోడ్డుగా ఈదారే దిక్కు. గ్రామసచివాలయంలో ఏచిన్న అవసరం ఏర్పడినా రంపాడు ప్రజలు బాలరాజుపల్లె, నర్సాపురం మీదుగా లేదా పోరుమామిళ్ళ మీదుగా దాదాపు 11 కిలోమీటర్లు ప్రయాణించి ఓబుళాపురం వెళ్లి వస్తున్నారు. 3 కి.మీ దూరంలో ఉన్న సచివాలయానికి సరైన దారి సదుపాయం లేక పోవడంతోనే 11 కిలోమీ టర్లు ప్రయాణం చేయాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు.

మున్సిపల్ కూరగాయల మార్కెట్ లీజు వేలం

ప్రొద్దుటూరు ,జనవరి 27 : ప్రొద్దుటూరు మున్సిపల్ తాత్కాలిక కూరగాయల మార్కెట్‌కు లీజు వేలం పాటలు జరిగాయి. శనివారం మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య అధ్యక్షతన 2024-2025 సంవత్సరానికిగాను జరిగిన వేలం పాటలలో అత్యధికంగా రూ. 1.33 కోట్లకు మల్లికార్జున అనే వ్యక్తి దక్కించుకున్నారు. ఈ వేలం పాటలలో ఆరుగురు పాల్గొన్నారు.కార్యక్రమంలో ఆర్ఐ శివ చరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.